ANN తెలుగు

Follow: @ANNTELUGU

10-09-2026

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 232 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## రూ.10వేల కోట్లతో ఏడు రైల్వే కారిడార్లు

**ఐదు మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్టులు**

కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక పరిధిలో 5 మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు

**ఢిల్లీ, మహా :** రైల్వే మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే దిశగా కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా 8 మల్టీట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టుల (దక్షిణాదిలో 5, ఉత్తరాదిలో 3 ప్రాజెక్టులకు )కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వీటిలో తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక పరిధిలోని 17 జిల్లాలను కలుపుతూ 5 మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులు ఉన్నాయి. రూ.10వేల కోట్లకు పైగా వ్యయంతో 7 రైల్వే కారిడార్లలో 4 లేన్ల నిర్మాణానికి కేంద్రం మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్



### "పవన్ కాళ్లు పట్టుకుని క్షమాపణలు చెబుతా..

- నన్ను వదిలేయండి".. ప్రశ్న రావణ్ సంచలన వేడుకోలు?
- నెల్లూరు జైలులో రెండు నెలలుగా రావణ్..

04



### బాత్రూమ్‌లోకి కూడా వస్తారా?

- మీడియాపై పినరయి విజయన్ ఫైర్
- ఈడీ కేసుపై మీడియా ప్రశ్నలకు తీవ్రంగా స్పందించిన మాజీ సీఎం

03



### మరో పాదయాత్రకు జగన్ రెడీ

- 2027 సెప్టెంబర్– అక్టోబర్‌లో ప్రారంభిస్తానని ప్రకటన
- ఇప్పుడు మళ్లీ ప్రజల్లోకి వైఎస్ జగన్.

03



## విజయ్ కూటమికి అధికారిక ముద్ర

- 'సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్'.
- కాంగ్రెస్, వీసీకే, ఎండీఎంకే, ఐయూఎంఎల్‌తో కొత్త రాజకీయ వేదిక.

**చెన్నై, మహా:** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధినేత, ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని కూటమికి ఎట్టకేలకు అధికారిక పేరు ఖరారైంది. 'సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్'గా కూటమికి నామకరణం చేశారు. బుధవారం చెన్నై పణయూర్‌లోని టీవీకే ప్రధాన కార్యాలయంలో జరిగిన రెండో సమన్వయ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇచ్చిన భాగస్వామ్య పక్షాలతో జరిగిన ఈ కీలక సమావేశానికి విజయ్ అధ్యక్షత వహించారు. కాంగ్రెస్, వీసీకే, ఎండీఎంకే, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నేతలు సమావేశంలో పాల్గొన్నారు. కూటమి అధికారిక నిర్మాణం, ఉమ్మడి కార్యాచరణ, భవిష్యత్ వ్యూహాలపై నేతలు విస్తృతంగా చర్చించారు. కూటమి అధికారిక పేరుతో పాటు కామన్ మినిమమ్ ప్రోగ్రామ్ రూపకల్పన, సంయుక్త స్టీరింగ్ కమిటీ ఏర్పాటు, సమన్వయ వ్యవస్థ, కూటమి భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలు సమావేశంలో చర్చకు వచ్చినట్లు పలు నివేదికలు వెల్లడించాయి. లౌకికవాదం, సామాజిక న్యాయాన్ని కూటమి ప్రధాన సిద్ధాంతాలుగా ముందుకు మిగితా 3వ పేజీలో

# అసెంబ్లీ ఘటనలపై సమగ్ర విచారణ



**సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన**

ఫామ్‌హౌస్‌లో భేటీ నుండి మూడు రోజుల ఘటనలపై విచారణ

దళితులు డప్పుకొట్టిన చోట.. బీఆర్ఎస్ నేతలు శుద్ధిచేయడంపై ఆగ్రహం

ఉగ్రవాదులకు, స్పీకర్‌ను తిట్టిన వారికి తేడా లేదు

**హైదరాబాద్, మహా :** ఉగ్రవాదులకు, స్పీకర్‌ను తిట్టిన వారికి తేడా లేదని, కులవివక్ష, అణచివేత చర్యలను తమ ప్రభుత్వం ఉపేక్షించదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి ఎర్రవల్లి ఫామ్ హౌజ్‌లోనే కుట్ర జరిగిందని ఆరోపించారు. ఫామ్‌హౌస్‌లో భేటీ మొదలుకుని వరుస ఘటనలపై విచారణ జరిపిస్తామని, అంటరానితనం ప్రదర్శించిన వారిపై విచారణకు ఆదేశిస్తున్నామని, కుట్రలు చేసిన వారిని, అమలు చేసిన వారిని కోర్టు ముందు దోషులుగా నిలబెడతామని స్పష్టం చేశారు. అంటరానితనం ఘటనపై విచారణ అధికారిగా విజయ్‌కుమార్‌ను నియమిస్తున్నామని వెల్లడించారు.

**అందరినీ శిక్షించేలా విచారణ**

అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపై మిగతా 2వ పేజీలో

## అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

**అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్**

కేటీఆర్, హరీశ్‌రావుతో సహా 22 మందిపై యాక్షన్



02



## ట్రెండ్ ను ఫాలో అవుతున్నారు

**సోషల్ మీడియాను షేక్ చేస్తున్న 1980 ట్రెండ్**

వైరల్ గా మారిని సెలబ్రిటీల ఫొటోలు

అపుడు గిబ్లి.. ఇపుడు 80

**హైదరాబాద్, మహా :** ప్రస్తుతం సోషల్ మీడియాలో 1980 ట్రెండ్ నడుస్తోంది. ఏఐ, ఛాట్ జీపీటీల సాయంతో చాలా మంది తమ ఫొటోలను 80 స్పెషల్ ఫొటోలుగా మార్చుకుని తెగ మురిసిపోతున్నారు. సామాన్యులతో పాటు సెలబ్రిటీలు కూడా ఈ ట్రెండ్ ను ఫాలో అవుతున్నారు. తమ ఏఐ 80s ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఓ సరికొత్త ట్రెండ్ నడుస్తోంది. గతంలో వచ్చిన 'స్టూడియో గిబ్లీ' ఏఐ ట్రెండ్ తర్వాత.. ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో మరో సరికొత్త ట్రెండ్ వైరలవుతోంది. అదే వింటేజ్ 1980's ట్రెండ్. దీని ప్రకారం నెటిజన్లు ఏఐ సాయంతో తమను తాము గత కాలానికి చెందిన రూపాల్లో మళ్లీ ఊహించుకుంటున్నారు. చాట్‌జీపీటీ ప్రాంప్ట్ ను ఉపయోగించి నెటిజన్లు తమ కొత్త సెల్ఫీలను 1980 దశాబ్దం నాటి ఫొటోలుగా మార్చుకొని తెగ మురిసిపోతున్నారు. సామాన్యులతో పాటు సెలబ్రిటీలు కూడా ఈ 1980' ట్రెండ్ ను తెగ ఇష్టపడుతున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మొదలుకుని రాజకీయ ప్రముఖులు, సినీ సెలబ్రిటీలు, బుల్లితెర ప్రముఖులు తమ ఫొటోలను 1980 స్పెషల్ ఫొటోలుగా మార్చుకుని తెగ మురిసిపోతున్నారు. ఇక నెటిజన్లు కూడా తమ అభిమాన హీరోలు, హీరోయిన్లు 80ల నాటి తారలుగా మిగతా 2వ పేజీలో

## పంచాయతీల సొంత నిధులకు కొత్త వెసులుబాటు



- అసెంబ్లీలో కీలక సవరణ బిల్లు
- ట్రెజరీ స్థానంలో జాతీయ బ్యాంకులో ఖాతా
- గ్రామ పంచాయతీల ఆర్థిక లావాదేవీలకు వేగం.
- మంత్రి సీతక్క

**హైదరాబాద్, మహా:** గ్రామ పంచాయతీల ఆర్థిక నిర్వహణలో కీలక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పంచాయతీల సొంత ఆదాయాన్ని సమీపంలోని జాతీయ బ్యాంకులో జమ చేసుకునేలా తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018కు సవరణలు తీసుకొచ్చేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క బుధవారం శాసనసభలో సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులను సమీప ప్రభుత్వ ట్రెజరీలో జమ చేయాల్సి ఉండగా, సవరణ అమల్లోకి వస్తే పంచాయతీల మిగతా 3వ పేజీలో

### ఎస్ఐఆర్ ప్రక్రియలో పొరపాట్లకు తావివ్వొద్దు

- అర్హులందరికీ ఓటు హక్కు.
- మృతులు, శాశ్వత వలసదారుల పేర్లు నిబంధనల మేరకు తొలగించాలి.
- ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి.
- ఓటర్ల జాబితాపై సీఈవో సీఈవో సుదర్శన్‌రెడ్డి ఆకస్మిక తనిఖీలు.

02



### ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేశారు

- గవర్నర్‌కు ఆధారాలు చూపాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- గవర్నర్ ను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల టీమ్

02



02

## బీఆర్ఎస్ నాయకులు చేసిన శుద్ధీకరణపై గవర్నర్‌కు మంత్రుల ఫిర్యాదు

- డిప్యూటీ సీఎం భట్టి ఆధ్వర్యంలో గవర్నర్ కు వినతి

**హైదరాబాద్, మహా :** లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్ కుమార్ శుక్లాను పలువురు మంత్రులు కలిశారు. బీఆర్ఎస్ నాయకులు చేసిన శుద్ధీకరణపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. అసెంబ్లీ తొలిరోజు లోపలికి ప్రవేశించే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరు స్పీకర్‌ను అవమానపర్చేవిధంగా మాట్లాడిన తీరును మంత్రులు గవర్నర్‌కు వివరించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీ దొర అహంకారంతో వ్యవహరిస్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విమర్శించారు. శాసనసభ స్పీకర్, అతని తల్లిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు దూషించారని, దీన్ని నిరసిస్తూ కేసీఆర్ ఫామ్ హౌజ్ దగ్గర డప్పులతో దళితులు నిరసన తెలిపిన ప్రాంతాన్ని శుద్ధి చేయడం కేసీఆర్ దళిత వ్యతిరేక విధానాలకు నిదర్శనమని అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. ఈ రెండు ఘటనలపై డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలో పలువురు మంత్రులు గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల ఫిర్యాదుపై స్పీకర్ స్పందించారని, ఘటనపై విచారణకు ఆదేశించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారని లక్ష్మణ్ తెలిపారు. ప్రజాపాలనలో అంటరానితనానికి తావు లేదని, ఇలాంటి కుల వివక్ష ఘటనలను సహించబోమని అడ్లూరి ప్రకటించారు. బీఆర్ఎస్ నేతల తీరును గవర్నర్‌కు వివరించడం కోసమే తాము లోక్ భవన్‌కు వెళ్లినట్లు ఆయన తెలిపారు.

### స్పీకర్ వ్యాఖ్యలపై ఎథిక్స్ కమిటీ సీరియస్

- మహిళా ఎమ్మెల్యేల ఘటనపైనా చర్చ.
- తాతా మధు, నవీన్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన కమిటీ.
- మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల వ్యవహారశైలిపై న్యాయ సలహాలు తీసుకోవాలని నిర్ణయం.

03



# అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

**కేటీఆర్, హరీశ్‌రావుతో సహా 22 మందిపై యాక్షన్**



**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై శాసనసభలో సస్పెన్షన్ వేటు పడింది. దీంతో ఈ సమావేశాలకు మొత్తంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దూరంగా ఉండనున్నారు. శాసనసభ సజావుగా కొనసాగకుండా అడ్డుకుంటున్న బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌కు శ్రీధర్‌బాబు సిఫారసు చేయగా, స్పీకర్ అనుమతిస్తూ వేటు వేశారు. శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కోవా లక్ష్మి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజేయుడు, కె.సంజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానందలపై సస్పెన్షన్ వేటు పడింది.

**భట్టి ఆగ్రహం**

సభాపతికి చేయాల్సిన అవమానాలన్నీ బీఆర్ఎస్ నేతలు చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. అవమానాలు కొనసాగించే పరిస్థితి మానుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. సభాపతి సూచన చేస్తే వాదన పెట్టుకోకుండా సభ సజావుగా నడిచేలా చూడాలన్నారు. వెల్‌లోకి వచ్చి చేయాల్సిన అవమానాలన్నీ చేసి స్పీకర్‌పై సవాల్ విసురుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మగౌరవానికి భంగం కలిగించే ప్రయత్నం చేయొద్దని కోరారు. విభజన తీసుకురావడానికి మరో ప్రయత్నం మంచిది కాదని, సభాపతితో పాటు వారి తల్లిని దూషిస్తే నిరసనలు తెలిపారని అన్నారు.

# అసెంబ్లీ ఘటనలపై సమగ్ర విచారణ

( మొదటి పేజీ తరువాయి )

కూడా విచారణ చేపడుతున్నామని, డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తామని స్పష్టం చేశారు. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కుట్రధారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా విచారణ చేస్తామని, క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంటరానితనం ప్రదర్శించిన వారిపై విచారణకు ఆదేశిస్తున్నాం. కుట్రలు చేసిన వారిని, అమలు చేసిన వారిని కోర్టు ముందు దోషులుగా నిలబెడతాం. అంటరానితనం ఘటనపై విచారణ అధికారిగా విజయ్‌కుమార్‌ను నియమిస్తున్నాం. విచారణాధికారిగా హైదరాబాద్ జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్‌ను నియామిస్తున్నాం. అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నాం. డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తాం. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటాం.కుట్రధారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా విచారణ జరుగుతుంది. క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటాం. ఫామ్‌హౌస్‌లో భేటీ మొదలుకుని వరుస ఘటనలపై విచారణ జరిపిస్తాం" అని సీఎం ప్రకటించారు.

శుద్ధి చేయడమేంటి?



దళిత సభాపతిని అవమానించినందుకు అందరి మనోభావాలు దెబ్బతిన్నాయని, స్పీకర్‌ను దూషించడాన్ని ఖండిస్తూ ఎస్సీ ప్రజలు డప్పులతో నిరసన తెలిపారని సీఎం పేర్కొన్నారు. ఎక్కడ కుట్ర జరిగిందో అక్కడ డప్పు మోగించి వాళ్ల నిరసన తెలిపారని, ఫామ్‌హౌస్‌కు చాలా దూరంలో డప్పు కొట్టారే తప్ప ఎవరినీ తిట్టలేదు, దాడి చేయలేదని స్పష్టం చేశారు. దళిత సమాజానికి క్షమాపణలు చెప్పాలని మాత్రమే వారు కోరారని, వారికి కేసీఆర్ క్షమాపణలు చెప్పకుండా మరో కుట్రకు ఆదేశించారని వెల్లడించారు. కేసీఆర్ ఆదేశాల మేరకే శుద్ధి చేశామని బీఆర్ఎస్ నేత సంధ్యారావు పోస్టు చేశారని, పదేళ్లు సీఎంగా ఉండి విజ్ఞత కలిగిన నాయకుడు ఇలా చేస్తారా? ప్రశ్నించారు.

శుద్ధి చేయాల్సింది నేలను కాదని, అంటరానితనం ఆలోచనలను శుద్ధి చేయాలని, తరతరాలుగా వాళ్ల మనసుల్లో ఉన్న కుళ్లు, అంతరాలను శుద్ధి చేయాలని హితవు పలికారు. దళితులు నడిచారని నేలను శుద్ధి చేయించిన దొర అహంకారాన్ని శుద్ధి చేయాలని, దళితులను అవమానించిన ప్రతి ఒక్కరిని చట్టపరంగా కూడా శిక్షిస్తామని హెచ్చరించారు. మల్లికార్జున ఖర్గే, ప్రసాద్‌కుమార్‌కు జరిగిన అవమానాలు వ్యక్తులకు జరిగినవి కాదని, కులవివక్ష, అణచివేత చర్యలను ప్రజా ప్రభుత్వం ఉపేక్షించదని స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ నాయకులు చేసిన శుద్ధీకరణపై

**గవర్నర్‌కు మంత్రుల ఫిర్యాదు**
**డిప్యూటీ సీఎం భట్టి ఆధ్వర్యంలో గవర్నర్ కు వినతి**

**హైదరాబాద్, మహా :** లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్‌కుమార్ శుక్లాను పలువురు మంత్రులు కలిశారు. బీఆర్ఎస్ నాయకులు చేసిన శుద్ధీకరణపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. అసెంబ్లీ తొలిరోజు లోపలికి ప్రవేశించే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరు స్పీకర్‌ను అవమానపర్చేవిధంగా మాట్లాడిన తీరును మంత్రులు గవర్నర్‌కు వివరించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీ దొర అహంకారంతో వ్యవహరిస్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విమర్శించారు. శాసనసభ స్పీకర్, అతని తల్లిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు దూషించారని, దీన్ని నిరసిస్తూ కేసీఆర్ ఫామ్ హౌజ్ దగ్గర డప్పులతో దళితులు నిరసన తెలిపిన ప్రాంతాన్ని శుద్ధి చేయడం కేసీఆర్ దళిత వ్యతిరేక విధానాలకు నిదర్శనమని అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. ఈ రెండు ఘటనలపై డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలో పలువురు మంత్రులు గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల ఫిర్యాదుపై స్పీకర్ స్పందించారని, ఘటనపై విచారణకు ఆదేశించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారని లక్ష్మణ్ తెలిపారు. ప్రజాపాలనలో అంటరానితనానికి తావు లేదని, ఇలాంటి కుల వివక్ష ఘటనలను సహించబోమని అడ్లూరి ప్రకటించారు. బీఆర్ఎస్ నేతల తీరును గవర్నర్‌కు వివరించడం కోసమే తాము లోక్ భవన్‌కు వెళ్లినట్లు ఆయన తెలిపారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో పొరపాట్లకు తావివ్వొద్దు.

- అర్హులందరికీ ఓటు హక్కు.
- మృతులు, శాశ్వత వలసదారుల పేర్లు నిబంధనల మేరకు తొలగించాలి.
- ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి.
- ఓటర్ల జాబితాపై సీఈవో సీఈవో సుదర్శన్‌రెడ్డి ఆకస్మిక తనిఖీలు.



**ఆదిలాబాద్:మహా :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పూర్తిగా పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో మృతులు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు, అనర్హుల పేర్లను నిబంధనల ప్రకారం గుర్తించి తొలగించాలని స్పష్టం చేశారు.బుధవారం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో సీఈవో సుదర్శన్‌రెడ్డి పర్యటించారు. తాంసీ మండలం ఘోట్కూరి, భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే, ఓటర్ల వివరాల పరిశీలన, దరఖాస్తుల స్వీకరణ, ధ్రువీకరణ తదితర ప్రక్రియలను ఆయన క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. బీఎల్ఓల వద్ద ఉన్న దరఖాస్తులు, ఓటర్ల జాబితాలను పరిశీలించిన సీఈవో.. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హతను నిర్ధారించిన తర్వాతే జాబితాలో మార్పులు, చేర్పులు చేపట్టాలని సూచించారు.ఓటర్ల పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాల్లో తప్పులు ఉన్నట్లయితే నిబంధనల ప్రకారం సరిచేయాలని సుదర్శన్‌రెడ్డి సూచించారు. ఇంటింటి సర్వే సందర్భంగా ప్రతి కుటుంబంలోని ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత వ్యక్తుల నుంచి ధ్రువీకరించిన సమాచారం ఆధారంగానే మార్పులు, చేర్పులు, తొలగింపులు చేపట్టాలని స్పష్టం చేశారు.ఎవరైనా ఓటరు శాశ్వతంగా ఇతర ప్రాంతానికి వలస వెళ్లినట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, మృతుల పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగకుండా వాటిని గుర్తించి తొలగించే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అయితే అర్హత కలిగిన ఓటరు పేరు పొరపాటున తొలగిపోకుండా ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు.

**యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి**

18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సీఈవో సూచించారు. తొలిసారి ఓటు హక్కు పొందే యువత తమ వివరాలను నమోదు చేసుకునేలా బీఎల్ఓలు, సంబంధిత అధికారులు ప్రజలకు అవసరమైన సమాచారాన్ని అందించాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ తమ పేరు ప్రస్తుత ఓటర్ల జాబితాలో ఉందో లేదో స్వయంగా పరిశీలించుకునేలా ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే నిబంధనల ప్రకారం వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం అత్యంత ముఖ్యమని సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన ఓటర్ల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా, అనర్హుల పేర్లు కొనసాగకుండా సమతుల్యంగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే ఇంటింటి స్థాయిలో ఓటర్ల వివరాల పరిశీలన, దరఖాస్తుల స్వీకరణ, ధ్రువీకరణ వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గతంలోనూ నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎస్ఐఆర్ సందర్భంగా డూప్లికేట్, మృతులు, వలస వెళ్లిన ఓటర్ల వివరాలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించారు .ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో బీఎల్ఓల పనితీరును స్వయంగా పరిశీలిస్తూ సీఈవో సుదర్శన్‌రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. గడువులోగా ప్రక్రియను పూర్తి చేయడంతో పాటు ప్రతి ఓటరు వివరాన్ని నిబంధనలకు అనుగుణంగా ధ్రువీకరించి, తుది జాబితా నాణ్యతలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు.

# "పవన్ కాళ్లు పట్టుకుని క్షమాపణలు చెబుతా..

- నన్ను వదిలేయండి".. ప్రశ్న రావణ్ సంచలన వేడుకోలు?
- నెల్లూరు జైలులో రెండు నెలలుగా రావణ్..
- సెప్టెంబర్ 22 వరకు రిమాండ్ పొడిగింపు





**విజయవాడ, మహా :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు , సోషల్ మీడియాను కొంతకాలం హీటెక్కించిన పేరు ప్రశ్న రావణ్. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆయన కుటుంబంపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో పాటు గతంలో ఆయన చేసిన కొన్ని వీడియోల ఆధారంగా పోలీసులు కేసులు నమోదు చేయడం, వరుస అరెస్టులు జరగడం అప్పట్లో తీవ్ర రాజకీయ చర్చకు దారితీసింది. అయితే ప్రస్తుతం ఆయనకు సంబంధించిన మరో తాజా సమాచారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ప్రస్తుతం నెల్లూరు సెంట్రల్ జైలులో ఉన్న ప్రశ్న రావణ్ రిమాండ్ సెప్టెంబర్ 22 వరకు పొడిగించినట్లు తాజాగా ప్రచురితమైన కథనాలు పేర్కొంటున్నాయి. కోర్టులో ఆయన మాట్లాడినట్లుగా చెబుతున్న కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి. అయితే ఈ వ్యాఖ్యలకు సంబంధించిన పూర్తి కోర్టు రికార్డు లేదా అధికారిక ధ్రువీకరణ అందుబాటులో లేదన్న విషయాన్ని గమనించాల్సి ఉంది.

వైరల్ అవుతున్న సమాచారం ప్రకారం.. తాను చేసిన తప్పుకు క్షమాపణలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నానని, అవసరమైతే పవన్ కల్యాణ్ కాళ్లు పట్టుకుని క్షమాపణలు చెబుతానని, ఇక తనను విడిచిపెట్టాలని ఆయన న్యాయమూర్తిని వేడుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఇది ప్రస్తుతం మీడియా కథనాలు, సోషల్ మీడియా ప్రచారంలో ఉన్న వాదన మాత్రమే. దీనిని కోర్టు అధికారిక వ్యాఖ్యగా పరిగణించడానికి ఆధారాలు లేవు.

అసలు వివాదం ఏంటి?

ప్రశ్న రావణ్ అరెస్టు వ్యవహారం జూన్-జూలైలో ఏపీ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. పవన్ కల్యాణ్‌పై, ఆయన కుటుంబంపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో ఆయనపై కేసులు నమోదయ్యాయి. ఏలూరులో జరిగిన ఓ సభలో చేసిన వ్యాఖ్యలు కూడా కేసులో ప్రస్తావనకు వచ్చాయి. పోలీసులు ఆయనపై వివిధ చట్టాల కింద కేసులు నమోదు చేయగా, UAPA నిబంధనలు కూడా వర్తింపజేసినట్లు అప్పటి నివేదికలు పేర్కొన్నాయి.అయితే కేసుల విషయంలో న్యాయస్థానాల నుంచి రావణ్‌కు గతంలో పలుమార్లు బెయిల్ లభించింది. ఒక కేసులో బెయిల్ వచ్చిన వెంటనే మరో కేసులో అరెస్టు చేయడం జరిగిందని అప్పట్లో ఆయన తరఫు న్యాయవాదులు, వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. జూలై ప్రారంభంలో వరుసగా నాలుగోసారి బెయిల్ లభించినట్లు కూడా నివేదికలు వచ్చాయి.

**అప్పట్లో ప్రకాష్ రాజ్ మద్దతు**

రావణ్ అరెస్టు సమయంలో ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ బహిరంగంగా స్పందించారు. వరుస అరెస్టులను ప్రశ్నిస్తూ, బెయిల్ వచ్చిన తర్వాత మళ్లీ అరెస్టు చేయడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "అరెస్ట్/బెయిల్.. మా పోరాటం కొనసాగుతుంది" అంటూ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. భావప్రకటన స్వేచ్ఛకు సంబంధించిన అంశంగా దీనిని ఆయన ప్రశ్నించారు.అయితే ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కథనాల్లో.. అప్పట్లో రావణ్‌కు మద్దతుగా నిలిచిన పలువురు ఇప్పుడు ఈ వ్యవహారంపై పెద్దగా స్పందించడం లేదనే చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ప్రకాష్ రాజ్ తర్వాత రావణ్ విషయంలో ఎలాంటి తాజా న్యాయపరమైన జోక్యం చేసుకున్నారనే అంశంపై సోషల్ మీడియాలో ప్రశ్నలు వస్తున్నాయి. అయితే ఆయన రావణ్‌ను కలవలేదనే లేదా ములాఖత్‌కు వెళ్లలేదనే వాదనకు స్వతంత్ర ధ్రువీకరణ మాత్రం లభించలేదు.

**మళ్లీ సోషల్ మీడియాలో చర్చ**

రావణ్ అరెస్టు సమయంలో కొద్ది రోజుల పాటు సోషల్ మీడియా వేదికగా తీవ్ర చర్చ జరిగింది. ఒకవైపు ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని కొందరు డిమాండ్ చేయగా.. మరోవైపు భావప్రకటన స్వేచ్ఛ పేరుతో అరెస్టులను వ్యతిరేకిస్తూ పలువురు స్పందించారు. ప్రకాష్ రాజ్ కూడా ఈ అరెస్టులపై బహిరంగంగా ప్రశ్నలు సంధించారు.ఇదే సమయంలో పవన్ కల్యాణ్ మాత్రం భావప్రకటన స్వేచ్ఛకు పరిమితులు ఉంటాయని స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(2) కింద దేశ సార్వభౌమత్వం, సమగ్రత, ప్రజా శాంతి, మర్యాద, నైతికత తదితర అంశాల పరిరక్షణ కోసం సహేతుకమైన పరిమితులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో భాగమే అయినప్పటికీ, నేరపూరిత వ్యాఖ్యలకు చట్టపరమైన పరిణామాలు తప్పవని ఆయన అన్నారు.

**బెయిల్ వస్తుందా.. కేసు ఎటు?**

ప్రస్తుతం ప్రశ్న రావణ్ కేసులో తదుపరి న్యాయపరమైన పరిణామాలపై ఆసక్తి నెలకొంది. రిమాండ్ కొనసాగుతున్న నేపథ్యంలో ఆయనకు బెయిల్ లభిస్తుందా? లేక కేసు విచారణ మరింత ముందుకు సాగుతుందా? అన్నది కోర్టు నిర్ణయించాల్సిన అంశం. యూ ఏ పి ఏ వంటి కఠిన చట్టాల వర్తింపు నేపథ్యంలో బెయిల్ అంశం సాధారణ కేసులతో పోలిస్తే భిన్నమైన న్యాయపరమైన ప్రమాణాలకు లోబడి ఉంటుంది. అయితే "నాలుగేళ్లు జైలులోనే ఉంటారా?" అనే ప్రచారాన్ని ప్రస్తుతం ఖచ్చితమైన విషయంగా చెప్పడం సరికాదు. కేసు విచారణ, అభియోగాల స్వరూపం, కోర్టు ఆదేశాలు, బెయిల్ పిటిషన్లపై నిర్ణయాల ఆధారంగానే ఆయన భవిష్యత్ న్యాయపరమైన పరిస్థితి తేలనుంది.




# ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేశారు

**హైదరాబాద్, మహా :** లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు కలిశారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల అనుచిత ప్రవర్తనపై, శాంతిభద్రతలు, ఇతర అంశాలపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. శాసనసభ్యులపై నడిరోడ్డుపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపామని, ఎమ్మెల్యే సబితపై పోలీసుల దాడి, సునీత చీర లాగి దుశ్శాసన పర్వానికి తెరలేపడంపై ఆధారాలు సమర్పించామని తెలిపారు. తమపై దాడులు చేసి తమపైనే కేసులు పెట్టారని శివ్‌ప్రతాప్ శుక్లాకు వివరించామని పేర్కొన్నారు. దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు కాలేదని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల గురించి కూడా గవర్నర్‌కు వివరంగా తెలిపామని కేటీఆర్ తెలిపారు. వంద రోజుల్లోనే అన్ని హామీలు అమలు చేస్తామని అరచేతిలో స్వర్గం చూపారని, కానీ ప్రభుత్వంలోకి వచ్చి వెయ్యి రోజులైనా హామీలు అమలు చేయలేదని కేటీఆర్ ఆరోపించారు.





# ట్రెండ్‌ను ఫాలో అవుతున్నారు

మార్చేస్తున్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఫొటోలను, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫొటోలు వైరల్ గా మారాయి. కేసీఆర్, కేటీఆర్ తో తమ ఫొటోలను ట్రెండ్ కు అనుగుణంగా మార్చి అభిమానులు షేర్ చేస్తున్నారు. ఎంపీ చామల కిరణ్ సీఎంతో తాను ఉన్న ఫొటో 80 ట్రెండ్ తో షేర్ చేశారు. ఇక సినీ సెలబ్రిటీల ఫొటోలు, హీరోల ఫొటోలు 1980 ట్రెండ్ తో చర్చగా మారాయి. ట్రెండ్ ను ఫాలో అవుతూ సెలబ్రిటీలు కొత్త ట్రెండ్ సెట్ చేస్తున్నారు.









# ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు టోకరా

- మోసం చేసిన నిందితుడు అరెస్ట్
- రూ.85 లక్షల నగదు, 4 తులాల బంగారం వసూల్
- నకిలీ నియామక ఉత్తర్వులతో మోసం

**హనుమకొండ, కాజీపేట మహ** : ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి నిరుద్యోగ యువత నుంచి భారీ మొత్తంలో నగదు, బంగారం, అసలు విద్యా సర్టిఫికెట్లు సేకరించి మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని కాజీపేట పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు మెట్టు ప్రవీణ్ కుమార్ (41), నిజామాబాద్ జిల్లా నివాసిగా గుర్తించారు. ఇన్‌కమ్ ట్యాక్స్ శాఖలో థాంక్స్ అసిస్టెంట్, ఇన్కమ్ టాక్స్ ఆఫీసర్ వంటి ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగ యువతను నమ్మించి డబ్బులు వసూలు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలిందని మీడియా సమావేశంలో కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

**మోసం చేసిన విధానం**

నిందితుడు స్పోర్ట్స్ కోటా, ఎన్సిసి, లేదా బ్యాక్ డోర్ పేర్లతో ఉద్యోగాలు ఇప్పిస్తానని అభ్యర్థులను ఆకర్షించినట్లు పోలీసులు తెలిపారు. ఉద్యోగాలకు సంబంధించిన వెబ్‌సైట్లు చూపిస్తూ, గతంలో జారీ అయిన ఉద్యోగ నియామక ఉత్తర్వులలో పేర్లు మార్చి నకిలీ నియామక పత్రాలు వినతి పత్రాలు తయారు చేసి అభ్యర్థులకు చూపించినట్లు విచారణలో వెల్లడైంది. అంతేకాకుండా మోసం మరింత నమ్మదగినదిగా కనిపించేలా అభ్యర్థులకు మెడికల్ టెస్టులు, పోలీస్ వెరిఫికేషన్ వంటి ప్రక్రియలతో నటించినట్లు పోలీసులు తెలిపారు. అలాగే ఐ సి ఏ ఐ లో నిర్వహించే ఐటీ కోర్సులను ప్రభుత్వ ఉద్యోగానికి సంబంధించిన శిక్షణగా నమ్మించి పలువురు యువతను మోసం చేసినట్లు దర్యాప్తులో తేలింది.గుర్తించిన బాధితులు మోసం చేసిన మొత్తంఇప్పటివరకు గుర్తించిన బాధితుల నుంచి సుమారు రూ.85 లక్షల నగదు, 4 తులాల బంగారం తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. బాధితుల నుంచి అసలు విద్యా సర్టిఫికెట్లు, ఉద్యోగ సంబంధిత పత్రాలు కూడా తీసుకున్నట్లు వెల్లడైంది స్వాధీనం చేసుకున్న వస్తువులునిందితుడి వద్ద నుంచి సుమారు రూ.18.22 లక్షల విలువైన నగదు మరియు ఇతర ఆస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న వాటిలో ఒక మారుతి కారు డెల్ కంపెనీ లాప్టాప్ తో పాటు రూ.2 లక్షల నగదు ఐఫోన్ మ్యాక్స్ ఒప్పో స్మార్ట్ ఫోన్ల తో పాటు రెండు కీప్యాడ్ మొబైల్ ఫోన్లుబాధితులకు సంబంధించిన అసలు విద్యా సర్టిఫికెట్లు, ఉద్యోగ సంబంధిత పత్రాలునకిలీ ఉద్యోగ నియామక ఉత్తర్వులు తయారు చేసేందుకు ఉపయోగించిన పారదర్శక షీట్లు, ప్లాస్టర్, ఎల్లో హైలైటర్, ఐడెంటిటీ కార్డు జిరాక్స్ తదితర వస్తువులు ఉన్నాయి.అదనంగా పలువురు బాధితులకు సంబంధించిన ముఖ్యమైన అసలు పత్రాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల దర్యాప్తుకాజీపేట ఏసీపీ పి. ప్రశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు, కాజీపేట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జె. శ్యామ్ సుందర్ పర్యవేక్షణలో పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో సమగ్ర దర్యాప్తు చేపట్టి నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు.ఈ కేసులో మరింత మంది బాధితులు ఉన్నారా, నిందితుడి మోసాల వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు

**ప్రజలకు కాజీపేట పోలీసుల సూచన**

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని, బ్యాక్ డోర్ నియామకం ద్వారా ఉద్యోగం వస్తుందని, ప్రత్యేక కోటాలో ఉద్యోగం ఇప్పిస్తామని లేదా ప్రభుత్వ అధికారులతో పరిచయాలు ఉన్నాయని చెప్పి ఎవరైనా డబ్బులు అడిగితే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన నియామక ప్రక్రియ, నోటిఫికేషన్లు, ఫలితాలు తదితర సమాచారాన్ని సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారిక వెబ్‌సైట్లు, అధికారిక నోటిఫికేషన్ల ద్వారా మాత్రమే ధృవీకరించుకోవాలని సూచించారు.ఎవరైనా నకిలీ నియామక పత్రాలు, ఐడెంటిటీ కార్డులు, శాలరీ వేతన పత్రాలు లేదా ఇతర అధికారిక పత్రాలు చూపించినప్పటికీ, వాటిని సంబంధిత శాఖ అధికారుల ద్వారా తప్పనిసరిగా ధృవీకరించు కోవాలని పోలీసులు తెలిపారు.

# సింగరేణిలో సర్ నోటీసులను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

**అర్హుల ఓట్లు భద్రంగా ఉండాలి**

**కారేపల్లి, మహ:** సింగరేణి గ్రామపంచాయతీ లో సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో నిర్వహిస్తున్న గ్రామ సభను జిల్లా అడిషనల్ కలెక్టర్ డాక్టర్ శ్రీజ బుధవారం తనిఖీ చేశారు. సర్ సర్వే సందర్భంగా వచ్చిన అభ్యంతరాలపై ఎలక్షన్ కమీషన్ ఓటర్లకు వ్యక్తిగతంగా నోటీసులు జారీ చేసివాటి నివృత్తి కోసం బూత్ లవారిగా గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఎలక్షన్ కమీషన్ నోటీసులు అందుకున్న ఓటర్లు నోటీసులో తెల్పిన అభ్యంతరాలపై తగు పత్రాలుసమర్పించాల్సి ఉంటుంది. అభ్యంతరాల పరిశీలన కార్యక్రమాని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ అధికారులతో పలు సూచనలు చేశారు. అర్హులైన ఓటరు పేరును ఎట్టి పరిస్థితిలోను తొలగింపుకు గురికావద్దన్నారు. అభ్యంతరాల పరిశీలనలో మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ తప్పని సరిగా ఉండాలన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు గ్రామసభకు వచ్చి తగు పత్రాలు సమర్పించేలా బీఎల్వోలు చైతన్యం చేయాలని కోరారు. ఎప్పటికప్పుడు ఎలక్షన్ కమీషన్ వెబ్ సైట్ లో ఆన్ లైన్ చేయాలని ఆదేశించారు. ఆడినల్ కలెక్టర్ వెంట ఎంపిడీవో పద్మ, సర్పంచ్ మేదరి వీరప్రతాఫ్, కార్యదర్శి నెహ్రు తదితరులు ఉన్నారు.

# విజయ్ కూటమికి అధికారిక ముద్ర

( మొదటి పేజీ తరువాయి )



తీసుకెళ్లేలా నిర్మాణాన్ని రూపొందించడంపై దృష్టి పెట్టారు.సమావేశానికి తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు మాణికం ఠాగూర్‌తో పాటు కాంగ్రెస్ నేతలు ప్రవీణ్ చక్రవర్తి, తారగై క్యాథ్‌బర్ట్ హాజరయ్యారు. వీసీకే తరపున ఆ పార్టీ అధినేత తొల్ తిరుమావళవన్ పాల్గొన్నారు. ఎండీఎంకే నుంచి వైకో, దురై వైకో, ఐయూఎంఎల్ తరపున కేఎం కాదర్ మొహిదీన్, ఏఎం షాజహాన్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.టీవీకే నేతృత్వంలోని ఈ కూటమిలో కాంగ్రెస్, వీసీకే, ఎండీఎంకే, ఐయూఎంఎల్ భాగస్వాములుగా ఉన్నాయి. అయితే సీపీఐ, సీపీఐ(ఎం) ప్రతినిధులు ఈ రెండో సమన్వయ సమావేశానికి హాజరు కాలేదు. గతంలోనూ వామపక్ష పార్టీలు ప్రభుత్వానికి బయట నుంచి మద్దతు ఇస్తున్నప్పటికీ, కూటమిలో అధికారిక భాగస్వాములుగా తమను పరిగణించలేదని స్పష్టం చేసిన విషయం రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీస్తోంది. కూటమి పేరులోని 'సెక్యులర్', 'సోషల్ జస్టిస్', 'విక్టరీ' పదాలకు రాజకీయంగా ప్రాధాన్యం ఉందని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ముఖ్యంగా లౌకికవాదం, సామాజిక న్యాయం, ఎన్నికల విజయాన్ని ప్రధాన లక్ష్యాలుగా ప్రతిబింబించేలా పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, కూటమి భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై కూడా భాగస్వామ్య పక్షాలు దృష్టి సారించాయి. రాష్ట్ర సమస్యలపై ఉమ్మడి వైఖరిని రూపొందించడం, ప్రభుత్వ పాలనలో భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం, రానున్న రాజకీయ సవాళ్లను సమష్టిగా ఎదుర్కోవడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు సమాచారం. ఈ సమావేశంతో టీవీకే నేతృత్వంలోని భాగస్వామ్య పక్షాల మధ్య కూటమి నిర్మాణానికి మరింత అధికారిక రూపం వచ్చినట్లయింది. ఇకపై 'సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్' పేరుతో కూటమి రాజకీయ కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లనుంది. కూటమికి విజయ్ అధ్యక్షుడిగా వ్యవహరించనున్నట్లు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మాణికం ఠాగూర్ వెల్లడించినట్లు హిందుస్థాన్ టైమ్స్ నివేదించింది.

# మరో పాదయాత్రకు జగన్ రెడీ

- 2027 సెప్టెంబర్–అక్టోబర్‌లో ప్రారంభిస్తానని ప్రకటన
- ఇప్పుడు మళ్లీ ప్రజల్లోకి వైఎస్ జగన్.



అమరావతి,మహా. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. 2027 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో పాదయాత్ర ప్రారంభిస్తానని ఆయన ప్రకటించారు. పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న జగన్.. తన తదుపరి రాజకీయ కార్యాచరణపై పార్టీ శ్రేణులకు స్పష్టత ఇచ్చారు. కూటమి ప్రభుత్వ విధానాలపై ఇప్పటికే ప్రెస్‌మీట్లు, పర్యటనల ద్వారా జగన్ తన వాణిని వినిపిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇక నేరుగా ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు తమ పార్టీ వైఖరిని ప్రజలకు వివరించేలా రాష్ట్రవ్యాప్త పాదయాత్ర చేపట్టాలని నిర్ణయించినట్లు ఆయన ప్రకటన ద్వారా స్పష్టమవుతోంది.

**2019లో 3,800 కిలోమీటర్లు**

జగన్‌కు పాదయాత్ర రాజకీయంగా కొత్త వ్యూహం కాదు. 2019 ఎన్నికలకు ముందు 2017 నవంబర్‌లో ప్రారంభించిన 'ప్రజా సంకల్ప యాత్ర'లో భాగంగా ఆయన సుమారు 3,648 కిలోమీటర్లు నడిచారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైసీపీ ప్రచారాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. ప్రత్యేక హోదా, రైతులు, ఉద్యోగాలు, సంక్షేమం, ప్రభుత్వ విధానాలు తదితర అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ జగన్ ప్రజలను కలిశారు. సుదీర్ఘంగా సాగిన ఆ పాదయాత్ర అనంతరం 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించింది. మొత్తం 175 అసెంబ్లీ స్థానాల్లో 151 స్థానాలను గెలుచుకుని అధికారాన్ని చేపట్టింది. ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్.. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయారు. అయినప్పటికీ రాజకీయంగా వెనక్కి తగ్గకుండా పార్టీ కార్యక్రమాలు, పర్యటనలు, ప్రభుత్వంపై విమర్శలను కొనసాగిస్తున్నారు.

**ఓటమి తర్వాత మళ్లీ ప్రజల్లోకి..**

2024 ఎన్నికల ఓటమి తర్వాత వైసీపీ సంస్థాగతంగా ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో జగన్ మరోసారి ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించుకోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కేవలం పార్టీ సమావేశాలు, మీడియా ప్రకటనలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజలను కలవడం ద్వారా పార్టీకి కొత్త ఊపు తీసుకురావాలనే వ్యూహంలో భాగంగానే ఈ పాదయాత్ర నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, ప్రభుత్వ హామీలు, సంక్షేమ పథకాలు, రైతులు, మహిళలు, యువత, ఉద్యోగాలు తదితర అంశాలను ప్రజల మధ్యకు తీసుకెళ్లేందుకు పాదయాత్రను వేదికగా చేసుకునే అవకాశం ఉంది. అదే సమయంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించేలా పార్టీ ప్రచార వ్యూహాన్ని రూపొందించే అవకాశం కనిపిస్తోంది.

# బాత్రూమ్‌లోకి కూడా వస్తారా?

- ఈడీ కేసుపై మీడియా ప్రశ్నలకు తీవ్రంగా స్పందించిన మాజీ సీఎం

**తిరువనంతపురం, మహా** : కేరళ ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మరోసారి మీడియా ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసు గురించి మీడియా వెంటపడడంతో సహనం కోల్పోయారు. "నాతో పాటు బాత్రూమ్‌లోకి కూడా వస్తారా?" అని వారిపై విరుచుకుపడ్డారు. బుధవారం చంగనచేరికి వెళుతుండగా మార్గ మధ్యంలో విజయన్ మధ్యాహ్నం కల్లిస్సేరిలోని పీడబ్ల్యూడీ రెస్ట్ హౌస్‌లో ఆగారు. అప్పటికే అక్కడ వేచి ఉన్న మీడియా ప్రతినిధులు, ఆయన కారు దిగగానే చుట్టుముట్టి ఈడీ కేసు గురించి ప్రశ్నలు సంధించారు. అయితే విజయన్ మౌనంగా రెస్ట్ హౌస్‌లోకి నడిచారు. విలేకరులు ఆయన్ను అనుసరిస్తూ లోపలికి వెళ్లి మళ్లీ అవే ప్రశ్నలు అడిగారు. ఒక గదిలోకి వెళ్లే ముందు, వెనక్కి తిరిగిన విజయన్ తీవ్ర అసహనంతో.. "నేను ఇక్కడికి వచ్చింది మిమ్మల్ని కలవడానికి కాదు" అని చెబుతూ, "నేను ఎక్కడికి వెళితే అక్కడికి వస్తారా... బాత్రూంలోకి వెళ్లినా వదలరా?" వ్యాఖ్యానించారు. అనంతరం గదిలోకి వెళ్లిపోయారు. కాసేపటి తర్వాత బయటకు వచ్చి మౌనంగానే తన వాహనంలో చంగనచేరికి వెళ్లిపోయారు.

# గణేష్ మండపాల వద్ద భద్రత చర్యలు చేపట్టాలు

**మండపాల నిర్వాహకులకు అవగాహన కల్పించిన సీఐ సాగర్**

**కారేపల్లి, మహ:** గణేష్ మండపాలను ఏర్పాటు చేసే వారు తప్పని సరిగా మండపాలవద్ద ముందస్తు భద్రత చర్యలు తీసుకోవాలని సింగరేణి సీఐ ఎన్.సాగర్,ఎస్సై బైరు గోపీ లు కోరారు. బుధవారం కారేపల్లిలోని సింగరేణి సర్కిల్ కార్యాలయంలో గణేష్ ఉత్సవ కమిటీల సభ్యులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ, ఎస్సై లు మాట్లాడుతూ మండపాల వద్ద కమిటీ సభ్యులు నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. భక్తి కార్యక్రమాన్ని కలుషితం చేయకుండా ప్రశాంత వాతావరణలో నవరాత్రులు నిర్వహించాలని కోరారు. విద్యుత్ షాట్ సర్క్యూట్లు పట్ల, అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్త అవసరమన్నారు.మండపాల స్థలాలు, నిమర్జన తేదిలు కమిటీ సభ్యుల పేర్లు, ఫోను నెంబర్లు పోలీసులకు అందజేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులకు సహకరించాలన్నారు

# కస్తూర్బాలో ఘనంగా కాళోజి జయంతి



**కారేపల్లి, మహ:** కారేపల్లి కస్తూర్బాగాంధీ బాలిక గురుకుల విద్యాలయంలో బుధవారం ప్రజాకవి కాళోజీ నారాయణ జయంతిని ఘనంగా నిర్వహించారు. కాళోజి చిత్రపటానికి విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ జీ.ఝాన్సీసౌజన్య పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్బంగా ఆమె మాట్లాడుతూ పల్లె ప్రజలకు ఆకట్టుకునేలా తెలంగాణ యాసలో ఎన్నో కవితలు రచించి, ప్రజలను చైతన్యపరిచిన గొప్ప వ్యక్తి కాళోజీ అని కొనియాడారు. కాళోజి బాషాభివృద్దికి చేసిన కృషిని గుర్తించి ఆయన జయంతిని తెలుగుబాష దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు.

# 'నిజం గెలిచింది'

- 53 రోజుల జైలు జీవితం గుర్తుచేసుకున్న సీఎం చంద్రబాబు
- 'నన్ను జైల్లో పెట్టగలిగారు కానీ నా స్థైర్యాన్ని దెబ్బతీయలేకపోయారు.



**అమరావతి, మహా:** 'ప్రజల కోసం నిలబడితే.. ప్రజలు మన వెంట నిలబడతారు. నిజం కోసం నిలబడితే.. నిజమే మనల్ని నిలబెడుతుంది' అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తనను అరెస్టు చేసి 53 రోజుల పాటు జైల్లో ఉంచిన ఘటనకు మూడేళ్లు పూర్తైన సందర్భంగా బుధవారం 'నిజం గెలిచింది' హ్యాష్‌ట్యాగ్‌తో ఎక్స్ వేదికగా ఆయన భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. మూడేళ్ల క్రితం కుట్రపూరితంగా తనను అరెస్టు చేశారని చంద్రబాబు పేర్కొన్నారు. "నన్ను అక్రమంగా అరెస్టు చేసి 53 రోజులు జైల్లో పెట్టారు. నన్ను జైల్లో పెట్టగలిగారు కానీ నా స్థైర్యాన్ని దెబ్బతీయలేకపోయారు. వారి రాక్షస చర్యకు కుంగిపోలేదు.. లొంగిపోలేదు" అని ఆయన పేర్కొన్నారు.ఆ క్లిష్ట సమయంలో తెలుగు ప్రజలు, టీడీపీ కార్యకర్తలు, అభిమానులు తనకు అండగా నిలిచారని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. దేశ, విదేశాల్లో తనకు మద్దతుగా ప్రజలు గొంతెత్తారని, ప్రజాస్వామ్యం, న్యాయం, సత్యం కోసం పోరాడారని తెలిపారు. ఆ సమయంలో ప్రజలు చూపిన సంఘీభావం, తెగువ తన జీవితంలో ఎన్నటికీ చెరగని జ్ఞాపకమని అన్నారు. తనను నిర్బంధించగలిగినా దేశ, విదేశాల్లో తనకు మద్దతుగా ప్రజలు లేవనెత్తిన గొంతును మాత్రం అణచలేకపోయారని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజల మద్దతే తనకు మరింత ధైర్యాన్ని ఇచ్చిందని తెలిపారు. 2024 ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు ద్వారా తనకు మరింత బలమైన మద్దతు ఇచ్చారని చంద్రబాబు అన్నారు. కక్షసాధింపు రాజకీయాలను ఓడించి, నిజాన్ని గెలిపించి రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యత తను తమకు అప్పగించారని పేర్కొన్నారు. మూడేళ్ల క్రితం జరిగిన ఘటనను గుర్తుచేసుకుంటూ 'నిజం గెలిచింది' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రజల కోసం మరింత కష్టపడి పనిచేయాలనే సంకల్పాన్ని బలోపేతం చేశాయని చంద్రబాబు తెలిపారు. తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు జాతిని నెంబర్ 1గా నిలపాలన్న తన కలను ప్రజల సహకారంతో సాకారం చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు టీడీపీ శ్రేణుల్లో మరోసారి భావోద్వేగాన్ని రేకెత్తించాయి. ఇదే సమయంలో టీడీపీ రాష్ట్రవ్యాప్తంగా 'నిజం గెలిచింది' కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

# స్పీకర్ వ్యాఖ్యలపై ఎథిక్స్ కమిటీ సీరియస్.

- మహిళా ఎమ్మెల్యేల ఘటనపైనా చర్చ.
- తాతా మధు, నవీన్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన కమిటీ.
- మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల వ్యవహారశైలిపై న్యాయ సలహాలు తీసుకోవాలని నిర్ణయం.



**హైదరాబాద్, మహా.** తెలంగాణ శాసనమండలి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యల వ్యవహారం శాసనమండలి ఎథిక్స్ కమిటీలో తీవ్ర చర్చకు దారితీసింది. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆధ్వర్యంలో, ఎథిక్స్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో సమావేశం నిర్వహించి ఈ అంశంపై సభ్యులు విస్తృతంగా చర్చించారు.సమావేశానికి ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, దేశపతి శ్రీనివాస్ హాజరయ్యారు. శాసనసభ స్పీకర్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు చట్టసభల గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీ ఏకగ్రీవంగా తీవ్రంగా ఖండించింది.

**సభ గౌరవాన్ని కాపాడేందుకు చర్యలు.**

శాసనసభ, శాసనమండలి వంటి రాజ్యాంగబద్ధ సంస్థల గౌరవాన్ని పరిరక్షించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని కమిటీ స్పష్టం చేసింది. సభాపతి స్థానంపై అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొంది. ఈ వ్యవహారంలో నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ కసరత్తు ప్రారంభించింది.

**మహిళా ఎమ్మెల్యేల ఘటనపైనా చర్చ.**

అసెంబ్లీ ఆవరణలో నిరసన సందర్భంగా మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారన్న ఆరోపణలపై కూడా ఎథిక్స్ కమిటీ చర్చించింది. ప్రజాప్రతినిధుల హక్కులు, గౌరవం దెబ్బతినకుండా పోలీసు వ్యవస్థ వ్యవహరించాల్సిన అవసరాన్ని సభ్యులు ప్రస్తావించారు.ఈ అంశంపై చట్టపరమైన కోణంలో నిపుణుల అభిప్రాయాలు తీసుకుని తదుపరి చర్యలు నిర్ణయించాలని కమిటీ తీర్మానించింది. అవసరమైతే సంబంధిత అధికారుల నుంచి వివరణలు కూడా కోరే అవకాశమున్నట్లు సమాచారం.

**తదుపరి చర్యలపై ఆసక్తి.**

స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యల వ్యవహారంతో పాటు అసెంబ్లీ ఆవరణలో జరిగిన పరిణామాలపై ఇప్పటికే రాజకీయంగా తీవ్ర దుమారం కొనసాగుతోంది. ఎథిక్స్ కమిటీ నివేదిక ఆధారంగా శాసనమండలిలో ఎమ్మెల్సీలపై క్రమశిక్షణ చర్యల అంశం ముందుకు వచ్చే అవకాశం ఉంది. అలాగే మహిళా ఎమ్మెల్యేల ఘటనపై న్యాయపరమైన చర్యల విషయంలోనూ కమిటీ నివేదికకు ప్రాధాన్యం ఏర్పడింది.

# పంచాయతీల సొంత నిధులకు కొత్త వెసులుబాటు

( మొదటి పేజీ తరువాయి )



సొంత ఆదాయాన్ని బ్యాంకు ఖాతాలో నిర్వహించుకునే అవకాశం కలగనుంది. ప్రస్తుత చట్టంలోని సెక్షన్ 70(3) ప్రకారం గ్రామ పంచాయతీలకు వచ్చే మొత్తాలను సమీప ప్రభుత్వ ట్రెజరీలో జమ చేయాల్సి ఉంది. పంచాయతీల సొంత ఆదాయంలో ఇంటి పన్ను, వివిధ పన్నులు, సెస్సులు, ఫీజులు, మార్కెట్ల ద్వారా వచ్చే ఆదాయం, గ్రామ పంచాయతీకి చెందిన ఆస్తుల నుంచి వచ్చే ఆదాయం తదితరాలు ఉంటాయి. ప్రస్తుతం వీటిని ట్రెజరీలో జమ చేయాల్సి ఉండటంతో నిధుల వినియోగానికి సంబంధించిన ప్రక్రియలో కొంత ఆలస్యం ఏర్పడే అవకాశం ఉంది. సవరణ ద్వారా స్థానిక సంస్థలకు తమ సొంత నిధుల నిర్వహణలో మరింత వెసులుబాటు కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది.

**గ్రామ అవసరాలకు నిధులు వేగంగా**

సొంత ఆదాయం అందుబాటులో ఉండటంతో గ్రామ పంచాయతీలు తమ పరిధిలోని అత్యవసర అవసరాలకు నిధులను వేగంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడనుంది. పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిలైట్లు, చిన్నపాటి మౌలిక వసతుల నిర్వహణ వంటి స్థానిక అవసరాల కోసం నిధుల వినియోగ ప్రక్రియ సులభతరం కావచ్చని ప్రభుత్వం భావిస్తోంది. బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా లావాదేవీలు నిర్వహించడం వల్ల పంచాయతీల ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత, లెక్కల నిర్వహణ, ఆడిట్ ప్రక్రియ మరింత క్రమబద్ధంగా జరిగే అవకాశం ఉంటుంది. పంచాయతీల ఖాతాల నిర్వహణ, ఆడిట్‌కు సంబంధించిన నిబంధనలు ఇప్పటికే చట్టంలో ఉన్నాయి.స్థానిక సంస్థలకు ఆర్థిక స్వేచ్ఛ3గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా నిధులను వినియోగించేందుకు పంచాయతీలకు మరింత అవకాశం కల్పించడమే ఈ మార్పు లక్ష్యంగా ఉంది. సొంత ఆదాయం విషయంలో పంచాయతీలకు ప్రత్యక్ష నిర్వహణ అవకాశం కల్పిస్తే, చిన్నచిన్న అభివృద్ధి పనులకు నిధుల విడుదల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి తగ్గే అవకాశం ఉంది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద వచ్చే నిధులకు ప్రస్తుతం ఉన్న ప్రత్యేక నిబంధనలు కొనసాగుతాయి. ప్రస్తుత చట్టం ప్రకారం అలాంటి పథకాల నిధులను సమీపంలోని జాతీయ బ్యాంకులు, సహకార బ్యాంకులు లేదా పోస్టాఫీసుల్లో నిర్దేశించిన విధానంలో జమ చేయడానికి ఇప్పటికే అవకాశం ఉంది. శాసనసభలో బిల్లుపై చర్చ అనంతరం ఆమోదం లభించి, ప్రభుత్వం తదుపరి అమలు విధానాన్ని ఖరారు చేస్తే గ్రామ పంచాయతీల ఆర్థిక నిర్వహణలో ఈ మార్పు కీలకంగా మారనుంది. గ్రామీణాభివృద్ధి పనులకు నిధుల వినియోగాన్ని వేగవంతం చేయడంతో పాటు స్థానిక సంస్థల ఆర్థిక వ్యవహారాలను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు ఇది దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు మెరుగు పరచాలి

**నర్సంపేట, మహా ;** గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కోరారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు, సిబ్బంది కొరతను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.




CreatorBox
CONNECT. COLLABORATE. GROW.
PEOPLE
IDEAS
COLLABORATIONS
A BRIGHTER
TOMORROW
Something
BIG IS
COMING
LAUNCHING
SOON
9:41
CreatorBox
CONNECT. COLLABORATE. GROW.
Creators
Brands
Collaborate
Opportunities
Create
Collaborate
Grow
Opportunities
See all
Brand Collaborations
Creator Projects
Paid Campaigns
Events
Featured Creators
See all
Home
Explore
Messages
Profile
CREATORS
BRANDS
IDEAS
OPPORTUNITIES
TOGETHER.
A Bigger Tomorrow Together
SAME PASSION
BIGGER
POSSIBILITIES





# కాళోజీ నారాయణరావు సేవలు చిరస్మరణీయం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు పద్మభూషణ్ కాళోజీ నారాయణరావు సేవలు చిరస్మరణీయమని జీఎం(ఆర్ అండ్ డి)ఇంచార్జ్ జీఎం(సిపిపి) సిహెచ్.శ్రీనివాస్ అన్నారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలోని హెచ్ఆర్డి కాన్ఫరెన్స్ హాల్ నందు బుధవారం ప్రజాకవి స్వాతంత్ర సమరయోధుడు తెలంగాణ ఉద్యమకారుడు పద్మభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను నిర్వహించడం జరిగింది. జీఎం(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ అండ్ సెక్యూరిటీ కే.అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జీఎం(సిపిపి) సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కాళోజీ నారాయణరావు జయంతి ఉత్సవాలను ఇక్కడ ఇంత జరుపుకోవటం చాలా సంతోషంగా ఉందని కార్పొరేట్ లో మాత్రమే కాకుండా సింగరేణి వ్యాప్తంగా కూడా ఈ జన్మదిన వేడుకలను జరుపుకుంటున్నామని తెలిపారు. కాళోజీ నారాయణరావు స్వాతంత్ర సమరయోధిడిగా ప్రజాకవిగా తన కవితల ద్వారా ప్రజలలో చైతన్యం కలిగించి తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం (ఏఐటియూసి) బ్రాంచ్ సెక్రటరీ ఎస్.వి.రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం(ఐఎన్టియూసి) కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.పితాంబర రావు, సిఎంఓఏఐ ఉపాధ్యక్షుడు కేశవరావు, జీఎం(ఈ అండ్ ఎం) యూజి మైన్స్ కే.యాదయ్య, జీఎం(ఐ అండ్ పిఎం) ఎం.వి.నరసింహారావు, డిజీఎం(పర్సనల్)లు బి.శివ కేశవరావు, ముకుంద సత్యనారాయణ, కార్పొరేట్ లోని వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు, అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.




# కాళోజీ ఆశయాలను భావితరాలకు అందించాలి

- **భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ప్రజాకవి కాళోజీ నారాయణరావు సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ప్రజాకవి పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను బుధవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ అంకిత్ కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తెలంగాణ భాష సాహిత్యం సంస్కృతి సామాజిక చైతన్యానికి విశిష్ట సేవలు అందించారని తెలిపారు. కాళోజీ కేవలం కవి మాత్రమే కాకుండా సామాజిక ఉద్యమకారుడిగా ప్రజా చైతన్యవేత్తగా తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. తెలంగాణ మాండలిక భాషలో సామాజిక సమస్యలను ప్రతిబింబిస్తూ సాధారణ ప్రజల జీవితాలు వారి కష్టాలు ఆశలు ఆకాంక్షలను తన రచనల్లో ప్రతిబింబించినందుకే ఆయనకు ప్రజాకవి అనే బిరుదు లభించిందని అన్నారు. కాళోజీ రచనలు ప్రజల్లో ధైర్యాన్ని సామాజిక అవగాహనను చైతన్యాన్ని పెంపొందించాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తన కవిత్వం ద్వారా సమాజం ముందుకు తీసుకువచ్చి మార్పు కోసం కృషి చేశారని గుర్తుచేశారు. సమాజంలోని అన్యాయాలు అసమానతలపై తన రచనల ద్వారా గళమెత్తిన కాళోజీ ఆలోచనలు నేటికీ ప్రజలకు స్ఫూర్తినిస్తున్నాయని తెలిపారు. కాళోజీ నారాయణరావు సేవలను గుర్తించి ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారంతో సత్కరించడం గర్వకారణమని కలెక్టర్ అన్నారు. కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం ఆయనకు లభించిన అత్యున్నత గౌరవమని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించడం ద్వారా తెలంగాణ భాష సాహిత్యం సంప్రదాయాలు సంస్కృతిపై ప్రజల్లో మరింత అవగాహన పెరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా యువత కాళోజీ రచనలు ఆయన జీవితం ప్రజా ఉద్యమాల్లో ఆయన పోషించిన పాత్రను తెలుసుకోవాలని సూచించారు. తెలంగాణ భాషా వైభవాన్ని సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ కాళోజీ చూపిన ప్రజా చైతన్య మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పద్మావతి, కలెక్టరేట్ ఏఓ అనంత రామకృష్ణ, సీపీఓ సునీత, ఓఎస్డీ వెంకటరమణతో పాటు వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పత్తిలో సమగ్ర సస్యరక్షణతో

# చీడపీడలకు చెక్..

**అన్నారంలో రైతులకు ఐపీఎం పద్ధతులపై క్షేత్రస్థాయి అవగాహన..**

మణుగూరు, మహా : పత్తి పంటలో చీడపీడలను సమర్థవంతంగా నియంత్రించేందుకు రైతులు సమగ్ర సస్యరక్షణ (ఐపీఎం) పద్ధతులను పాటించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. మణుగూరు మండలం అన్నారం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ కార్యక్రమంలో భాగంగా రైతు కముజు చంద్ర మోహన్ పత్తి పంటలో ఐపీఎం సాంకేతికతపై బుధవారం క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తిలో చీడపీడల నియంత్రణకు రసాయనిక పురుగుమందుల వినియోగాన్ని తగ్గిస్తూ ఫెరోమోన్ ట్రాప్స్, స్టిక్కీ ట్రాప్స్, స్టెమ్ అప్లికేషన్, వేపనూనె తదితర సమగ్ర సస్యరక్షణ పద్ధతులను అనుసరించే విధానాన్ని అధికారులు రైతులకు ప్రత్యక్షంగా వివరించారు. ఐపీఎం పద్ధతులను సక్రమంగా అమలు చేయడం ద్వారా చీడపీడలను అదుపులో ఉంచడంతో పాటు పురుగుమందుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు అవసరమైన ఐపీఎం ఇన్‌పుట్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు బి తాటారావు, ఆత్మ డైరెక్టర్ ఆవుల సర్వేశ్వరరావు, వ్యవసాయ అధికారి వి రాహుల్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి డాక్టర్ కొమరం లక్ష్మణ్ రావు రైతులకు పత్తి పంటలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై పలు సూచనలు చేశారు. ఆత్మ డైరెక్టర్ కుర్రి చలపతి రావు, రైతులు బత్తుల శ్రీను, జాను తదితరులు పాల్గొన్నారు.



# ఏకలవ్యలో విద్యాబోధనకు ప్రాధాన్యత ఇవ్వాలి

- **తరగతి సమయాల్లో ఇతర కార్యక్రమాలు నిర్వహించొద్దు**
- **ప్రయోగాత్మక విద్యపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచాలి**
- **పరిశుభ్రత, ఆహార నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి**
- **భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ సూచన**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఏకలవ్య పాఠశాలలో విద్యాబోధనకు తొలి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు తరగతి సమయాల్లో ఇతర కార్యక్రమాలు నిర్వహించొద్దని ప్రయోగాత్మక విద్యపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచుతూ పరిశుభ్రత ఆహార నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. టేకులపల్లి మండలంలోని తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యాబోధన విద్యార్థుల హాజరు తరగతుల నిర్వహణ ప్రయోగశాలలు భోజనం పరిశుభ్రత యూనిఫాంలు వెల్నెస్ సెంటర్ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. తరగతుల గదులను పరిశీలించిన కలెక్టర్ కొన్ని తరగతుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంపై ఆరా తీశారు. గ్రామసభ విద్యార్థి పార్లమెంట్ స్కాలర్‌షిప్‌కు సంబంధించిన బ్యాంకు ఖాతాల ప్రారంభం వంటి కార్యక్రమాల కోసం విద్యార్థులు తరగతులకు దూరంగా ఉన్నట్లు అధికారులు వివరించారు. ఆర్ట్ అండ్ డ్రాయింగ్ తరగతిని పరిశీలించి బోధిస్తున్న అంశాలను తెలుసుకున్నారు. 8వ తరగతి లైబ్రరీ పీరియడ్‌కు బదులుగా స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తరగతి సమయాన్ని పూర్తిగా విద్యాబోధనకే కేటాయించాలని విద్యార్థులు ఉపాధ్యాయులు ఇతర కార్యక్రమాల్లో నిమగ్నం కాకుండా చూడాలని స్పష్టం చేశారు. గ్రామసభ విద్యార్థి పార్లమెంట్ బ్యాంకు ఖాతాల ప్రారంభం స్కౌట్స్ అండ్ గైడ్స్ వంటి కార్యక్రమాలను తరగతుల అనంతరం లేదా శనివారాల్లో నిర్వహించాలని ఆదేశించారు. విద్యా క్యాలెండర్ ప్రకారం ప్రతి పీరియడ్‌ను సక్రమంగా నిర్వహించి విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని సూచించారు. భౌతిక శాస్త్ర ప్రయోగశాలను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి ప్రయోగాలపై వారి అవగాహనను తెలుసుకున్నారు. పాఠ్యాంశాలను కేవలం పుస్తకాలకు పరిమితం చేయకుండా ప్రయోగాత్మకంగా నేర్పడం ఎంతో ముఖ్యమని ప్రతి విద్యార్థి ప్రయోగాల్లో స్వయంగా పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. ప్రయోగశాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం ఆసక్తి పెంపొందించేలా బోధన సాగాలని అన్నారు. కొత్తగా చేరిన కొంతమంది విద్యార్థులకు యూనిఫాంలు ఇంకా అందలేదని ప్రిన్సిపల్ వివరించడంతో అర్హులైన విద్యార్థులందరికీ యూనిఫాంలు త్వరగా అందేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

**పరిశుభ్రత లోపాలపై కలెక్టర్ అసంతృప్తి...**

భోజనశాల వంటగది మరుగుదొడ్లను పరిశీలించిన కలెక్టర్ పరిశుభ్రత లోపాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల భోజనశాల వంటగది మరుగుదొడ్లు పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన పరిశుభ్రమైన ఆహారం అందేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. వంట సిబ్బందితో మాట్లాడి విద్యార్థులకు అందుతున్న ఆహారం వివరాలను తెలుసుకున్నారు. ప్రధాన వంట మనిషి అనారోగ్యంతో సెలవులో ఉన్నట్లు తెలియడంతో విద్యార్థులకు భోజనంలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ వంట మనిషిని వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్టోర్ రూమ్‌లోని కూరగాయలు రిఫ్రిజిరేటర్‌లోని పాలు పెరుగు నాణ్యతను పరిశీలించిన కలెక్టర్ ఫుడ్ సేఫ్టీ అధికారుల ద్వారా నాణ్యత పరీక్షలు నిర్వహించాలని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం మాత్రమే అందేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని వెల్నెస్ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్ అక్కడ అందుబాటులో ఉన్న మందులను తనిఖీ చేశారు. మందుల నిల్వ వినియోగానికి సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి విద్యార్థులకు అవసరమైన వైద్య సేవలు మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విద్యాబోధన ప్రయోగాత్మక విద్య ఆహారం పరిశుభ్రత ఆరోగ్యం హాజరు తదితర అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులు తమ బాధ్యతలను పూర్తి జవాబుదారీతనంతో నిర్వహిస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట తాసిల్దార్ వీరభద్రం, ఎంపీడీవో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ఫార్మా కార్గోలో దేశంలోనే అగ్రస్థానం....

**జీఎంఆర్ సీఈఓ,, కధీర్ కధీరవన్...**

**రాజేంద్రనగర్ మహా :** ఫార్మా కార్గో రవాణాలో దేశంలోనే శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నెంబర్‌వన్ స్థానంలో కొనసాగుతోంది. దేశం మొత్తం మీద ఫార్మా ఉత్పత్తులు, వ్యాక్సిన్‌ల కోల్డ్‌చైన్ సరఫరాకు హైదరాబాద్ అత్యంత కీలకమైన హబ్‌గా మరిందని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సీఈఓకధీర్ కధీరవన్ తెలిపారు. 202526 ఆర్థిక సంవత్సరంలో, జిహెచ్ఎసి 1,79,000 మెట్రిక్ టన్నుల సరుకును నిర్వహించింది. ఇందులో ఎగుమతి సరుకులో 61 శాతం ఔషధ ఉత్పత్తులు ఉన్నాయి. భారతదేశంలోని ప్రముఖ ఔషధ వాయు సరుకు రవాణా కేంద్రాల్లో హైదరాబాద్ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. హైదరాబాద్, ఔషధాలు త్వరగా పాడైపోయే వస్తువుల కోసం భారతదేశంలోనే మొట్టమొదటి ప్రత్యేక ఉష్ణోగ్రతనియంత్రిత వాయు సరుకు రవాణా ప్రాంతాన్ని అభివృద్ధి చేసి, ప్రత్యేక సరుకు నిర్వహణలో కొత్త ప్రమాణాలను ఎయిర్‌పోర్ట్ నెలకొల్పింది. జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్ కార్గో (జిహెచ్ఎసి) మౌలిక సదుపాయాలు 2C నుంచి 8C, 15C నుంచి 25C వరకు వివిధ ఉష్ణోగ్రత, పాటు, 20C వరకు సున్నా కంటే తక్కువ ఉష్ణోగ్రతలో నిల్వ సదుపాయాన్ని అందిస్తున్నాయి. ఉష్ణోగ్రతకు సున్నితమైన సరుకుకు ప్రారంభం నుంచి ముగింపు వరకు సమగ్ర నిర్వహణ సదుపాయం లభిస్తుంది. కార్గో టెర్మినల్ 2, సంవత్సరానికి అదనంగా 50,000 మెట్రిక్ టన్నుల సరుకు సామర్థ్యంతో, ఔషధాలు, త్వరగా పాడైపోయే వస్తువులు, ఈకామర్స్ ఇతర అధిక విలువ కలిగిన సరుకు విభాగాల్లో భవిష్యత్ వృద్ధికి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ కార్గో సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ఫార్మా కార్గోలోభారతదేశంలోనే మొట్టమొదటి శీతలీకరణ సరుకు రవాణా ట్రక్కును ప్రవేశపెట్టింది. ఇది టెర్మినల్, విమానం మధ్య సరుకు బదిలీ జరిగే కీలక దశలో అవసరమైన ఉష్ణోగ్రతను నిరంతరం కొనసాగించడాన్ని నిర్ధారిస్తుంది.



# పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదుచేసిన బిఆర్ఎస్

**దమ్మపేట ,మహా :** బిఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు గత కొన్ని రోజులుగా చేస్తున్న రాజకీయ దాడుల పై బిఆర్ఎస్ మండల నాయకులు బుధవారం స్థానిక పోలీసు స్టేషన్ లోఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి,బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పై హత్య చేయడానికి కుట్ర జరిగిందనే ఆరోపణలు చేశారు. సోమవారం అసెంబ్లీలో చోటుచేసుకున్న పరిణామాలు,షాద్‌నగర్ ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్ చేసిన తీవ్ర వ్యాఖ్యలు అత్యంత భాధాకరంగా , ఆందోళన కలిగించాయని తీవ్ర మనస్థాపానికి గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు, నియోజకవర్గ ఇంచార్జ్,మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు సూచనలతో పోలీస్ స్టేషన్ లో యస్ఐ బాలస్వామికి బిఆర్ఎస్ పార్టీపై,పార్టీ నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కుట్రదాడిని వివరిస్తూ ఫిర్యాదు చేయటం జరిగింది. అసెంబ్లీలో రాజకీయ పరమైన వాదనలను ఒక వర్గాన్ని రెచ్చగొట్టే విధంగా ఉపయోగించి,అనంతరం పెద్ద సంఖ్యలో వాహనాల్లో వ్యక్తులను తీసుకొని కేసీఆర్ నివాసముంటున్న ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వైపు వెళ్లడం, కేసీఆర్ చంపాలంటూ చేసిన వ్యాఖ్యలు అత్యంత భాధాకరంగా ఉన్నాయని ఆవేధన చెందారు. ఈవిషయానికి సంబంధించిన వీడియోలు టీవీ, సోషల్ మీడియాలో ప్రచారంలోకి వచ్చిన నేపథ్యంలో పూర్తిస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. గత కొంతకాలంగా బీఆర్ఎస్ నాయకులపై, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టడం, భయభ్రాంతులకు గురిచేయడం, కేటీఆర్ ,హరీశ్‌రావు పై నిరాధారమైన ఆరోపణలతో కేసులు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేవిధంగా కేసీఆర్ పై గతంలో చేసినట్లు ఆరోపించబడుతున్న తీవ్ర, అవమానకరమైన వ్యాఖ్యలు,అసెంబ్లీ వేదికగా చేసిన బెదిరింపు ధోరణి వ్యాఖ్యలను కూడా పోలీసులు పరిగణనలోకి తీసుకుని సమగ్రంగా విచారణ జరపాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. పిర్యాదు చేసిన వారిలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల ఉపాధ్యక్షులు గాజుబోయిన యేసు బాబు ,మండల సీనియర్ నాయకులు దారా యుగంధర్ ,అబ్దుల్ జిన్న,సర్పంచ్ యాట్ల రామదాసు,వార్డు సభ్యులు దారా రాము,ఉయ్యాల లక్ష్మీనారాయణ,మాజీ కో ఆప్షన్ ఎంపీటీసీ బుడే, వెలుగోటి మహేష్,పాకనాటి శ్రీను,మాజీ ఎంపీటీసీ కాసిని శ్రీను,కొలికపోగు ధర్మ,కౌలురి నాగయ్య,బండ్ల లక్ష్మయ్య, దండాబత్తుల కాంతారావు తదితరులు పాల్గొన్నారు.




# కాళోజీ జీవితం తెలంగాణ భాషా, సాహిత్య వికాసానికి స్ఫూర్తి..

- **ఘనంగా కాళోజీ జయంతి, తెలంగాణ భాషా దినోత్సవం..**

**మణుగూరు, మహా :** ప్రజాకవి కాళోజీ నారాయణరావు జీవితం తెలంగాణ భాష, సాహిత్యం, సాంస్కృతిక ఉద్యమానికి దిక్సూచిగా నిలిచిందని జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ అన్నారు. బుధవారం సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దుర్గం రామచందర్ మాట్లాడుతూ కాళోజీ కేవలం కవి మాత్రమే కాదని, తెలంగాణ భాష, సాహిత్యం, సాంస్కృతిక ఉద్యమానికి దిక్సూచిగా నిలిచిన మహనీయుడని కొనియాడారు. సామాన్య ప్రజల గొంతుకగా తెలంగాణ భాషకు, యాసకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. కాళోజీ రచనలు ప్రజల జీవనాన్ని ప్రతిబింబించడంతో పాటు తెలంగాణ భాషా, సాహిత్య రంగాల్లో విశేష కృషి చేస్తున్న సాహితీవేత్తలకు ఆయన పేరిట పురస్కారాలు అందజేయడం గర్వకారణమన్నారు. కాళోజీ స్ఫూర్తిని నేటి యువత అందిపుచ్చుకొని తెలంగాణ భాష, యాస, సంస్కృతిని భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ పి.వి. మధన్ నాయక్, ఏజీఎం (ఐఈడీ) సి.హెచ్. రాంబాబు, ఏజీఎం (పర్సనల్) ఎస్. రమేష్, ఏరియా సర్వే అధికారి ఎల్. దయాకర్, క్వాలిటీ హెచ్‌వోడీ నాగరమేష్, పర్చేజ్ హెచ్‌వోడీ సుదర్శన్ రెడ్డి, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ కె శ్రీనివాస్, డిప్యూటీ ఫైనాన్స్ మేనేజర్ పి రమేష్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ బి. శ్యామ్ ప్రసాద్, సీనియర్ పర్సనల్ అధికారులు కె శ్రీనివాస్, పి రామేశ్వరరావు తదితర అధికారులు, మినిస్టీరియల్ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

# గెలిచిన సంఘం కార్మికులను వంచించింది..

- **హామీలు, అగ్రిమెంట్లు, కమిటీలతోనే కాలయాపన..**
- **సింగరేణిలో వెంటనే ఎన్నికలు నిర్వహించాలి**
- **సీఐటీయూ నేతలు తుమ్మల రాజిరెడ్డి, మంద నరసింహారావు**

**మణుగూరు, మహా :** సింగరేణిలో గెలిచిన గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అబద్ధపు మాటలు, అగ్రిమెంట్లు, కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ కార్మికులను వంచించిందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు, జేబీసీసీఐ సభ్యుడు మంద నరసింహారావు విమర్శించారు. గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో సింగరేణిలో వెంటనే ఎన్నికలు నిర్వహించాలని, లేనిపక్షంలో అన్ని కార్మిక సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బుధవారం పీవీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సీఐటీయూ రాష్ట్ర కమిటీ సమావేశం సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఏఐటీయూసీ 48 హామీలతో మేనిఫెస్టో విడుదల చేసి, అనంతరం 23 హామీల అమలుకు యాజమాన్యంతో ఒప్పందం చేసుకున్నట్లు ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని ఆరోపించారు. ఐక్య ఉద్యమాలు, జేఏసీలు ఏర్పాటు చేస్తామనే ప్రకటనలకే పరిమితమైందని, సొంతింటి కల, బినామీ పేర్ల తొలగింపు, కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు తదితర అంశాల్లో కమిటీల పేరుతో కాలయాపన చేసిందన్నారు. సింగరేణి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల సాధనకు గుర్తింపు సంఘం ఎందుకు గట్టిగా నిలదీయడం లేదని ప్రశ్నించారు. నిధుల కొరతతో కొత్త యంత్రాల కొనుగోలు, మరమ్మతులు, సేఫ్టీ పరికరాలు, వైద్య సదుపాయాల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. కొత్త బొగ్గు బావులను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వల్ల సింగరేణి కార్మికులతో బొగ్గు వెలికితీసే అవకాశాలు తగ్గడంతో పాటు స్థానికులకు ఉద్యోగావకాశాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మెడికల్ బోర్డు పేరుతోనూ కార్మికులను నెలల తరబడి నిరీక్షింపజేస్తూ నష్టానికి గురిచేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలు నిర్వహించాలి.. లేకుంటే సమాన ప్రాతినిధ్యం సింగరేణిలో గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసినందున యాజమాన్యం వెంటనే ఎన్నికల ప్రక్రియ చేపట్టాలని మంద నరసింహారావు డిమాండ్ చేశారు. ఎన్నికలు నిర్వహించే వరకు అన్ని కార్మిక సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. అండర్‌గ్రౌండ్ నుంచి సర్ఫేస్‌కు వచ్చిన కార్మికుల బేసిక్‌లో కోత విధించడంతో వారు తీవ్రంగా నష్టపోయారని, దీనిపై సీఐటీయూ పోరాటంతో పాటు న్యాయస్థానాన్ని ఆశ్రయించిందన్నారు. హైకోర్టు అనుకూల తీర్పుతో 23 మంది కార్మికులకు బేసిక్ చెల్లించారని తెలిపారు. ఇదే సమస్య ఎదుర్కొంటున్న ఇతర కార్మికుల తరపున కూడా పోరాటం కొనసాగిస్తామన్నారు. తన ఒప్పందం ఆలస్యమైతే ఉద్యమం కోల్ ఇండియాలో వేతన ఒప్పంద ప్రక్రియకు ఎదురవుతున్న ఆటంకాలపై అన్ని యూనియన్లు మూడు దఫాలుగా పోరాటాలు నిర్వహించాయని నేతలు తెలిపారు. వాటి ఫలితంగా సెప్టెంబర్ 2న కోల్‌కతాలో జరిగిన సమావేశంలో వేతన ఒప్పంద ప్రక్రియ ముందుకు వెళ్లేందుకు మార్గం సుగమమైందన్నారు. వేతన ఒప్పందాన్ని మరింత ఆలస్యం చేస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సి. గోపాల్ సంఘం జెండాను ఆవిష్కరించారు. సమావేశంలో రాష్ట్ర ఆఫీస్ బేరర్లు ఎ ముత్యంరెడ్డి, ఎ వెంకటస్వామి, మోదే శ్రీనివాస్, డి కొమరయ్య, వల్లూరు వెంకటరత్నం, వై వెంకటేశ్వరరావు, సాయి కృష్ణ, శ్రీనివాస్, ప్రవీణ్, వినయ్, రాజమౌళి, ముజాఫర్, ముత్యాల సుమన్, విల్సన్ రాజు, విజయ్ కుమార్, జి శంకర్, మాచారపు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.





# ఎస్పీ కార్యాలయంలో కాళోజి జయంతి వేడుకలు

**ఆదిలాబాద్ మహా :** తెలంగాణ భాష, సంస్కృతి, ప్రజా చైతన్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ప్రజా కవి, పద్మ విభూషణ్ స్వర్గీయ కాళోజి నారాయణరావు గారి జయంతి వేడుకలను జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్, కాళోజి నారాయణరావు గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తన కలంతో ప్రజల్లో ఉద్యమ చైతన్యాన్ని రగిలించిన కాళోజి సేవలను స్మరించుకుంటూ, తెలంగాణ భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు పి. మౌనిక ఐపీఎస్, బి. సురేందర్ రావు, డీఎస్పీ కమతం ఇంద్ర వర్ధన్, స్పెషల్ బ్రాంచ్ సీఐ మోహన్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ డి వెంకటి, పోలీసు కార్యాలయం ఏవో శివకుమార్, సూపరింటెండెంట్లు సులోచన, సంజీవ్ కుమార్ పాటు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కాళోజీ యాదిలో..

**నిర్మల్ మహా:** తెలంగాణ ప్రాంతీయ భాషాది నోత్సవం ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతిని నిర్మల్ జిల్లా కవులు ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక నిర్మల్ దామెర సాహితి క్షేత్రంలో కాళోజి ఫోటోకి పూలమాల వేసి నివాళులర్పించారు. పుట్టుక నీది చావు నీది బ్రతుకంతా దేశానిదే అని చెప్పిన గొప్ప సాహితీ వేత్త అని కాళోజి అని కవులు కొనియాడారు. తెలంగాణ భాష పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత ప్రేమ భాష పట్ల అభిమానం విలువ కట్టలేనిదని, 17 సంవత్సరాల వయసులో ని సాహిత్యం మీద అభిరుచిని పెంచుకొని కవిత్వం రాయడం ప్రారంభించారని అన్నారు. తెలంగాణ సాహితి లోకంలో తనకంటూ ఒక కొత్త చరిత్రను నిలుపుకున్న గొప్ప కవి స్వాతంత్ర సమరయోధుడు కాలోజి అన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ దామెర రాములు, డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు, డాక్టర్ తుమ్మల దేవరావు, నేరెళ్ల హనుమంతు, పత్తి శివప్రసాద్, కుమ్మరి నాగారం తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఓటర్ల జాబితా సవరణ

- పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియ
- అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా చర్యలు
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన రాష్ట్ర సీఈఓ సుదర్శన్‌రెడ్డి

**ఆదిలాబాద్ మహా**: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, మృతులు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను నిబంధనల మేరకు గుర్తించి తొలగించాలని సూచించారు.బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో కలిసి జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల, సంజయ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించారు. బీఎల్ఓల వద్ద ఉన్న దరఖాస్తులు, ఓటర్ల జాబితాలను పరిశీలించిన సీఈఓ, కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాల్లో తప్పులు ఉంటే నిబంధనల ప్రకారం సరిచేయాలని సూచించారు. ఇంటింటి సర్వేలో ప్రతి కుటుంబంలోని ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ధ్రువీకరించిన సమాచారం ఆధారంగానే మార్పులు, చేర్పులు, తొలగింపులు చేపట్టాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో డాక్యుమెంట్లను పరిశీలించి అవసరమైన వివరాలను సేకరిస్తున్నామని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. పత్రాలు అందుబాటులో లేని సందర్భాల్లో తహశీల్దార్లు సంబంధిత వ్యక్తులకు మార్గదర్శకాలు అందించి, అవసరమైన పత్రాలను సేకరించి పూర్తిస్థాయిలో ధ్రువీకరించాలని సూచించారు. ఈ ప్రక్రియ అనంతరం కలెక్టర్ల స్థాయిలో నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.అనంతరం తాంసీ తాంసీ మండలం ఘోట్కూరి, భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే, దరఖాస్తుల పరిశీలన తదితర ప్రక్రియలను తనిఖీ చేశారు.గత మూడు రోజులుగా క్షేత్రస్థాయి పరిశీలన కొనసాగుతోందని, జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ సజావుగా సాగుతోందని ఆయన వివరించారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. బీఎల్ఓలు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఈఓ సూచించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన ప్రతి వివరాన్ని సమగ్రంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా అత్యంత కీలకమైనదని, ప్రతి దశలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితాలో నమోదు కాకుండా మిగిలిపోకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, అనర్హుల పేర్లు కొనసాగకుండా నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రూ, ఎస్. రాజేశ్వర్, ఆదిలాబాదు, తాంసీ, భీంపూర్ తహశీల్దార్లు శ్రీనివాస్, గణేష్, రమేష్, ఎన్నికల నాయబ్ తహశీల్దార్లు సూరజ్, ఇస్తారీ, ఎన్నికల సూపర్‌వైజర్లు, బీఎల్ఓలు, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది, ఓటర్లు పాల్గొన్నారు.



## చలో ఢిల్లీని జయప్రదం చేయాలి..

- అక్టోబర్ 25న ఇందిరాపార్క్ మహాధర్నా..
- కార్మిక హక్కులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ప్రతిఘటించాలి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సి గోపాల్..

**మణుగూరు, మహా :** కేంద్ర ప్రభుత్వ విధానాలతో కోల్ ఇండియా, సింగరేణిలో కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు కాలరాయబడుతున్నాయని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సి.గోపాల్ విమర్శించారు. బుధవారం సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశాలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. కోల్ ఇండియాలో లేబర్ కోడ్‌లను కొత్త పద్ధతుల్లో అమలు చేస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకోవడంతో పాటు కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. లక్ష మంది కార్మికులతో ఢిల్లీలో భారీ నిరసన చేపట్టనున్నట్లు పేర్కొంటూ, సింగరేణి కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇందిరాపార్క్ మహాధర్నాకు తరలిరావాలి కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్రంలో అక్టోబర్ 25న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు గోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సింగరేణికి రావాల్సిన రూ.54 వేల కోట్ల బకాయిలను జెన్‌కో నుంచి వెంటనే ఇప్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను తెలంగాణలోనూ వేగంగా అమలు చేస్తున్నారని ఆరోపించారు. కనీస వేతన సలహా కమిటీలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూలకు ప్రాతినిధ్యం లేకుండా చేయడం కార్మిక వ్యతిరేక చర్యల్లో భాగమేనన్నారు. సింగరేణిలో కార్మిక హక్కులను కాపాడాల్సిన గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఎన్నికల నిర్వహణకు ముందుకు రావడం లేదని విమర్శించారు. సింగరేణిలో వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించి, లేబర్ కోడ్‌లు, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడే సంఘాన్ని ఎన్నుకునే అవకాశం కార్మికులకు కల్పించాలని గోపాల్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ నాయకులు, వివిధ ఏరియాల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు



## వేములకొండ సబ్ సెంటర్లో పోషకాహార వారోత్సవాలు

**వలిగొండ సెప్టెంబర్ 9 మహా న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వేములకొండ ప్రాథమిక సబ్ సెంటర్లో అంగన్వాడి టీచర్స్ అంబటి సువర్ణ,భోద్ర బోయిన శారద ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ అర్చన హాజరై వారు మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు పోషణ కలిగినటువంటి ఆహార పదార్థాలు ఆకు కూరలు పాలు గుడ్లు బెల్లం పల్లీలు నువ్వులు మునగ ఆకు మొదలగు ఆహార పదార్థాలు రోజువారి తినే ఆహారంలో తీసుకోవాలని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్ ఓ సుదర్శన్ ఏఎన్ఎం జె వినోద గర్భిణీలు బాలింతలు ఆశ కార్యకర్తలు బోడ కవిత గుంటోజు రామలీల నీలం నీరజ గడ్డం సూర్య కళ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత

**ఆదిలాబాద్ మహా :** నేరడిగొండ మండలం బోరిగాం శివారులోని అటవీ వ్యవసాయ భూమిలో పత్తి పంట మధ్యలో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసారు. అతని వద్ద నుండి 125 గంజాయి మొక్కలతో పాటు మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కల విలువ సుమారు 12లక్షల 50 వేల వరకు ఉంటుందని ఇచ్చోడా రూరల్ సీఐ రమేష్ తెలిపారు. గంజాయి సాగు, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి పండించే వారికి ప్రభుత్వ పథకాలు రాకుండా సిఫార్సు చేస్తామని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ ఎస్సై ఇమ్రాన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## వలిగొండలో మండల స్థాయి క్రీడోత్సవాలు

**వలిగొండ ,మహా న్యూస్ :**వలిగొండ పట్టణ కేంద్రంలో బుధవారం మండల స్థాయి క్రీడోత్సవాలు శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు ఈ క్రీడోత్సవాలకు ముఖ్య అతిథులుగా మండల ఎంపీడీవో జలంధర్ రెడ్డి టాప్ వేసి లాంచనంగా ప్రారంభించారు అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలో పాల్గొంటున్న విద్యార్థులను ఉత్సాహపరిచారు ఈ క్రీడోత్సవాలు ఎంఈఓ సుంకోజు భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు కార్యక్రమానికి స్థానిక ఎస్సై శ్రీకాంత్ రెడ్డి స్థానిక సర్పంచ్ వెంకట్ పాపిరెడ్డి ట్రస్మ అధ్యక్షులు పాలకూరల వెంకటేశం ఎం మాధవి విజయలక్ష్మి నరేష్ కృష్ణ ప్రసాద్ కనకదుర్గ చంద్రీదాస్ మల్లేశం బత్తిని సహదేవ్ మచ్చేందర్ తదితరులు పాల్గొన్నారు

## గురువు లేని వారు గురుతు ఎరుగరు... ప్రముఖ విద్యావేత్త తాజుద్దీన్...,

**కుషాయిగూడ, మహా :** గురువు లేని వారికి గుర్తింపు ఉండదు అని ప్రముఖ విద్యావేత్త సంఘ సేవకులు, నోబుల్ స్కూల్స్, ఆక్స్ఫర్డ్ ఇంటర్నేషనల్ స్కూల్స్ అధినేత తాజుద్దీన్ పేర్కొన్నారు. లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ 320 సి లయన్స్ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ ఆధ్వర్యంలో కాప్రా సర్కిల్ పరిధిలోని కాప్రా నోబుల్ పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయుడుగా గుర్తింపు పొందిన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఉత్తమ జీవితాన్ని పొందడానికి బోధించిన గురువులను ఎన్నటికీ మర్చిపోవద్దు అన్నారు. అలాంటి గురువుల ఆశయాలను అమలు జరిపే క్రమంలో ముందుకు సాగుతున్నామన్నారు. పాఠశాల స్థాయి నుండి నేటి విద్యా బోధకుడు స్థాయి వరకు అన్ని రకాల అండగా నిలిచిన గురు తత్వాన్ని ఎవరు మర్చిపోవద్దన్నారు. అనేకమంది నిరాశ్రయులైన నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తూ తన ఔదార్యాన్ని చాటుతున్న తాజుద్దీన్ లాంటి సంఘ సేవకులను సన్మానించడం గొప్ప విషయమని లైన్స్ క్లబ్ ఆఫ్ డిస్ట్రిక్ట్ 32సి 320 సి. జోన్ చైర్ పర్సన్ లయన్ వడ్లోజు జ్యోతిర్మయాచారి పేర్కొన్నారు.



వ్యాపార దృక్పథంతో కాకుండా మూర్తిభవించిన మానవత్వంతో నిస్సహాయ స్థితిలో ఉన్న నిరాశ్రయులైన అనాథ పిల్లలను సైతం గుర్తించి వారికి ఉచిత విద్యను అందించడం వారి సేవా నిరతికి నిదర్శనం అన్నారు. కిందిస్థాయి నుండి అంచలంచలుగా ఎదుగుతూ పైకి వచ్చిన ఇలాంటి ఉపాధ్యాయుల మూలంగా నిరుపేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వీరి సేవ తత్పరతను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు కలకొండ బిక్షపతి, లయన్ శివరాజ్, అనంతలక్ష్మి, ప్రముఖ రచయిత, ఆశు గాయకుడు నరసింహారెడ్డి,ప్రియాంక, ప్రభాకర్, పాండురంగ చారి ,రవి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పరిగూడ అంగన్వాడీ కేంద్రం సందర్శన

ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడలోని అంగన్వాడీ కేంద్రాన్ని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి బుధవారం సందర్శించారు. కేంద్రంలో చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, విద్యాబోధన, పరిసరాల పరిశుభ్రత, మౌలిక వసతులను పరిశీలించారు. చిన్నారుల హాజరు పట్టికతో పాటు వారి ఆరోగ్యం, పోషకాహార వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో వినితాదేవి, అంగన్వాడీ టీచర్, ఆయా తదితరులు పాల్గొన్నారు.



## బీసీల భూములపై కుట్రలు చేస్తే సహించం

- కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన అధికారులపై న్యాయపోరాటం చేస్తాం: బీసీ సంఘాల నేతలు

**మొయినాబాద్ మహా:** బీసీల భూములపై కుట్రలు చేస్తున్న అవినీతి అధికారుల భరతం పడతామని బీసీ సంఘాల నేతలు హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ గ్రామంలోని సర్వే నంబర్లు 22/ఆ, శ్రీనిధి ఇంటర్నేషనల్ స్కూల్ పరిసర ప్రాంతాల్లో దామ అరుణ్‌కుమార్‌కు సంబంధించిన సుమారు 2 ఎకరాల భూమిని బీసీ సంఘాల నేతలు, మీడియా ప్రతినిధులు పరిశీలించి మాట్లాడారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి బీసీల భూములపై ఎఫ్టీఎల్ పరిధి రుద్దుతున్నారని, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ముందస్తు నోటీసు లేకుండా ప్రహరీ గోడను మున్సిపల్, పోలీసు అధికారుల సమక్షంలో కూల్చివేశారని ఆరోపించారు. ఎఫ్టిఎల్ అంటున్న అధికారులు అధికారిక మ్యాప్, సర్వే నివేదిక, నోటీసు, కూల్చివేత ఉత్తర్వులను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. సేల్ డీడ్‌లో చెట్లు, పంటలు, వాటి సంరక్షణతో పాటు దారి హక్కులు అరుణ్‌కుమార్‌కు ఉండేలా ప్రత్యేక క్లాజులు ఉన్నాయని, సుమారు పదేళ్లుగా ఆయన భూమిని ఆధీనంలో ఉంచుకున్నారని తెలిపారు. కోర్టు పరిధిలోని వివాదాన్ని బెదిరింపులు, బౌన్సర్లు, ఫెన్సింగ్, సీసీ కెమెరాలు, రాజకీయపోలీసు ఒత్తిళ్లతో పరిష్కరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ సమగ్ర విచారణకు డిమాండ్ చేశారు. చెరువు పక్కనే ఉన్న శ్రీనిధి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రహరీ గోడ కూడా ఎఫ్టీఎల్ లో ఉంటే దానిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ అజీజ్‌నగర్ భూములపై సమగ్ర విచారణ చేపట్టాలని, త్వరలో రాష్ట్ర డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తామని, కోర్టు ఆదేశాలను గౌరవించకపోతే సంబంధిత అధికారులపై కోర్టు ధిక్కరణ కేసులు వేస్తామని, అవసరమైతే మున్సిపల్ కార్యాలయంతో పాటు అధికారుల కార్యాలయాలను ప్రజాస్వామ్య పద్ధతిలో ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు రావులకోల్ నరేష్ ప్రజాపతి, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రం గౌడ్, కనకాల శ్యాం కుర్మా, బర్ల మనిమంజరి సగర, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, గొడుగు మహేష్ యాదవ్, పానుగంటి విజయ్ గౌడ్, హనుమంతు ప్రజాపతి, తారకేశ్వరి, సంధ్యారాణి, ఇంద్రం రజక, అనంతుల సాయి గౌడ్ తదితర బీసీ, మహిళా సంఘాల నేతలు పాల్గొన్నారు.

## ప్రజల వాడుక భాషలోనే రచనలు ఉండాలి

**డాక్టర్ నందిని సిద్ధారెడ్డి**

**కుషాయిగూడ,మహా.:**ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా, ప్రజల వాడుక భాషలోనే రచనలు సాగాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నందిని సిద్ధారెడ్డి అన్నారు. కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా మంగళవారం కాప్రా ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన 'తెలుగునాడు' మాసపత్రిక ఆవిష్కరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభకు 'తెలుగునాడు' మాసపత్రిక ఎడిటర్ గుమ్మడి హరిప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నందిని సిద్ధారెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషలో ఎంతోమంది కవులు, రచయితలు విలువైన రచనలు చేస్తున్నారని, వారి రచనలు అభ్యుదయంతో పాటు సమాజాన్ని ప్రగతి వైపు నడిపించే విధంగా ఉండాలని ఆకాంక్షించారు. తెలుగు భాషలో దాగి ఉన్న గొప్పతనం, వైభవం, ప్రాధాన్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి భాష పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రముఖ పద్యకవి డాక్టర్ రాధశ్రీ మాట్లాడుతూ పద్యాల ద్వారా ప్రజలను అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు నడిపించవచ్చన్నారు. వేమన కాలం నుంచి నేటి వరకు పద్యం ప్రజలను చైతన్యపరిచే సాధనంగా కొనసాగుతోందని తెలిపారు.స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ గిడుగు రామమూర్తి పంతులు వ్యవహారిక భాష కోసం చేసిన కృషిని వివరించారు. కాళోజి నారాయణరావు తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించడంతో పాటు ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించారని పేర్కొన్నారు.సినీ గీత రచయిత మౌనశ్రీ మల్లిక్ మాట్లాడుతూ నేటి సమాజంలో అనేక ఉద్యమాలకు గీతాలు ఊపిరి పోశాయని అన్నారు. పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు అనేక ఉద్యమాలు విజయవంతమైన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. సమాజాన్ని ప్రభావితం చేయడంలో గీత రచనలకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు.కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వడ్లోజు జ్యోతిర్మయాచారి మాట్లాడుతూ ప్రస్తుత జర్నలిజం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సవాళ్లను వివరించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల బాధ్యత కీలకమన్నారు. కార్యక్రమంలో 'తెలుగునాడు' ఎగ్జిక్యూటివ్ బంగారు బి.వి. ఆచార్యులు, 'కుసుమ జయభేరి' సంపాదకులు రాధా కుసుమ, 'ధరణి' పత్రిక సంపాదకులు జి. రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సేవాలాల్ సేన 12వ ఆవిర్భావ వేడుకలు..

- సుందరయ్యనగర్‌లో సేవాలాల్ సేన జెండా ఆవిష్కరణ..

**మణుగూరు, మహా :** సేవాలాల్ సేన 12వ వార్షికోత్సవ ఆవిర్భావ వేడుకలను మణుగూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవ్ నాయక్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బాణోత్ హుస్సేన్ నాయక్ ఆదేశాల మేరకు మణుగూరు మండలం సుందరయ్యనగర్‌లో మండల కమిటీ ఆధ్వర్యంలో సేవాలాల్ సేన జెండాను ఆవిష్కరించారు. సేవాలాల్ సేన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గిరిజనుల హక్కులు, సంక్షేమం, అభివృద్ధి కోసం సంఘటితంగా కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. సేవాలాల్ మహారాజ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమవంతు పాత్ర పోషించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన పినపాక నియోజకవర్గ సలహాదారు ఇస్లావత్ కోటియా నాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర నిర్మల, మణుగూరు మండల అధ్యక్షుడు గూగులోత్ రవి నాయక్, మహిళా అధ్యక్షురాలు ఇస్లావత్ ద్వాలి, మహిళా ఉపాధ్యక్షురాలు గూగులోత్ కవిత, బాణోత్ శాంతి, అజ్మీర రాజేష్ నాయక్, అజ్మీర గణేష్ నాయక్, భూక్య నాగేశ్వరరావు నాయక్, బాణోత్ మంగమ్మ, గూగులోత్ రమేష్ నాయక్ తదితర మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





# వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన నిందితుడి అరెస్ట

**...లక్షెట్టిపేట జైలుకు తరలింపు**

బెల్లంపల్లి,మహా:తాండూరు మండలం అచలాపూర్ గ్రామానికి చెందిన కొట్టే రవి అనే వ్యక్తి, ఒక మహిళను వివాహం చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకొని ఆ తర్వాత పెళ్లి చేసుకోవడానికి నిరాకరించడంతో బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాండూరు పోలీస్ స్టేషన్‌లో తాండూర్ ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.కేసు దర్యాప్తు పూర్తయిన అనంతరం పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి బెల్లంపల్లి న్యాయస్థానంలో హాజరుపరచగా జడ్జ్ నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించడం తో లక్షెట్టిపేట సబ్ జైలుకు తరలించినట్లు తాండూరు ఎస్సై తెలిపారు.

# అన్యాయం పై అక్షరాయుధం మహా కవి కాళోజీ

- కాళోజీ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- వరంగల్ కలెక్టరేట్లో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు




**వరంగల్, కలెక్టరేట్ మహా ;** ప్రజాకవి, తెలంగాణ వైతాళికుడు పద్మవిభూషణ్ కాళోజీ నారాయణ రావు జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్ ఘనంగా నివాళులర్పించారు. బుధవారం కలెక్టరేట్ లో నిర్వహించిన కార్యక్రమంలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన గొప్ప ప్రజాకవి అని అన్నారు. తన రచనల ద్వారా ప్రజల సమస్యలను, వారి భావాలను ప్రతిబింబించిన మహనీయుడిగా కాళోజీ చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. తెలంగాణ భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కాళోజీ చేసిన సేవలు ఎనలేనివని అన్నారు. ప్రజల పక్షాన నిలబడి, సామాజిక చైతన్యాన్ని తన రచనల ద్వారా ప్రజల్లో నింపిన కాళోజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.కాళోజీ జయంతిని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించడం ఆయనకు అందిస్తున్నగొప్ప గౌరవమని తెలిపారు. యువత కాళోజీ సాహిత్యం, ఆయన ఆశయాలను అధ్యయనం చేసి సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె కిషోర్ కుమార్ అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్,డి ఆర్వో విజయలక్ష్మి, డిపియార్వో ప్రేమలత, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయం హక్కుల కోసం పోరాడుతాం

- సుదీర్ఘ చరిత్ర కలిగిన సంఘం
- ఆదిలాబాద్ లో టీయూడబ్ల్యూజే మహాసభ
- హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

**ఆదిలాబాద్ మహా:** జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా టీయూడబ్ల్యూజే ఐజేయూ పనిచేస్తుందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో జరిగిన సంఘ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, వృత్తిపరమైన హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం నిరంతరం పాటు పడతామన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు.ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ క్షేత్రస్థాయిలో వాస్తవాలను వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్టులపై ఎలాంటి వేధింపులు, ఒత్తిళ్లు వచ్చినా సంఘం అండగా నిలబడుతుందని స్పష్టం చేశారు.ఐజేయూకు ఎంతో సుదీర్ఘ చరిత్ర ఉందని 75 ఏళ్లుగా జర్నలిస్టుల హక్కుల కోసం పోరాటం చేస్తోందని వివరించారు. మీడియా రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా జర్నలిస్టుల సమస్యలు కూడా కొత్త రూపాల్లో ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. జర్నలిస్టులు తమ వృత్తిని స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అనుకూలమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, మీడియా యాజమాన్యాలపై ఎంతైనా ఉందని స్పష్టం చేసారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా జర్నలిస్టుల సమస్యలు మాత్రం పూర్తిస్థాయిలో పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. జర్నలిస్టులు ఐకమత్యంతో మెలుగుతూ సంఘాన్ని మరింత బలోపేతం చేసి హక్కుల సాధన కోసం కలిసికట్టుగా పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. అక్రిడిటేషన్లు, జర్నలిస్టుల వృత్తి భద్రత, కుటుంబాల సంక్షేమం తదితర అంశాలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలన్నారు. జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వాలతో చర్చలు జరుపుతూనే అవసరమైతే ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాలు కూడా చేపడతామని స్పష్టం చేశారు. ఈ సభలో సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్ , రాష్ట్ర నాయకులు ఎలగందుల రవి, ప్రకాష్రెడ్డి , రజనీ కాంత్ , కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్ ,జిల్లా కన్వీనర్ రాజేశ్వర్, కో కన్వీనర్ దేవేందర్, ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు సీనియర్ జర్నలిస్టులు, యూనియన్ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో ఘనంగా కాలేజీ జయంతి వేడుకలు..



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా: తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలను బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో బి.సి. సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ వ్యవసాయ మరియు రైతుల సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి, కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలక మధుసూదన్ రెడ్డి హాజరై కాళోజీ నారాయణ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ మరియు రైతుల సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి మాట్లాడుతూ, కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల జీవన విధానం, వారి కష్టాలు, ఆకాంక్షలను తన రచనల ద్వారా ప్రపంచానికి చాటిన ప్రజాకవి అని అన్నారు. తెలంగాణ భాష, సంస్కృతి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం కాళోజీ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన రచనలు నేటి తరానికి కూడా స్ఫూర్తినిస్తాయని, కాళోజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి మాట్లాడుతూ, తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాళోజీ జయంతిని నిర్వహించుకోవడం గర్వకారణమన్నారు. తెలంగాణ మాండలిక భాషకు, ప్రజల యాసకు కాళోజీ విశిష్టమైన గుర్తింపు తీసుకువచ్చారని తెలిపారు. సమాజంలోని అసమానతలు, అన్యాయాలపై తన రచనల ద్వారా ప్రశ్నించిన కాళోజీ స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తెలుగు భాషను, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బి.సి. సంక్షేమ శాఖ అధికారి కేషు రామ్, కలెక్టరేట్ ఏ.ఓ సునిల్, సిబ్బంది, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఇబ్రాహీంపట్నం ఎమ్మెల్యేను విమర్శిస్తే ఊరుకునేది లేదు.!

- మంచిరెడ్డి కిషన్ రెడ్డి మొద్దు నిద్ర వీడాలి
- రెండున్నర ఏళ్లలో జరిగిన అభివృద్ధిపై చర్చకు రావాలి
- డిసిసి అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 9 మహా:** స్థానిక శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నడూ లేని విధంగా, ఒక పక్కన వేల కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తూ, మరో పక్క కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను ఒక్కొకటిగా అమలు చేస్తూ, గత పది సంవత్సరాలలో జరగని అభివృద్ధిని, రెండున్నర సంవత్సరాలలో చేసి, ప్రజల మన్ననలు పొందుతున్న ఆయనను చూసి ఓర్వలేని, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ఓటమి చెంది రెండున్నర ఏళ్ళు గడిచిన ఇంకా మొద్దు నిద్ర వీడినట్టు లేదు అని దుయ్యబట్టారు. అధికారంలో ఉన్నప్పుడు ఆదమరచి నిద్రపోయి నియోజకవర్గ అభివృద్ధిని కొంటున్న పడేసి, ఈరోజు ఎమ్మెల్యే రంగారెడ్డి చేసే అభివృద్ధి అంతా, తన హయాంలో చేసినట్టు ఇంకా కలలు కంటూ, ఎమ్మెల్యే పై నిరాధార ఆరోపణలు చేస్తూ, ప్రజలను తప్పుతోవ పట్టించే విధంగా మాట్లాడి, రాజకీయ పబ్బం గడుపుకోవడం హాస్యాస్పదం అని మండిపడ్డారు. మీకు దమ్ము ధైర్యం ఉంటే గత ప్రభుత్వంలో మీరు చేసిన అభివృద్ధి పైన, ఈ రెండున్నర ఏళ్ళలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి పై, మాజీ ఎమ్మెల్యే చర్చకు రావాలని, డీసీసీ అధికార ప్రతినిధి బైరిక రమాకాంత్ రెడ్డి సవాల్ విసిరారు.

# దళితులను అవమానించిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలి

**మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు**

**బెల్లంపల్లి ,మహా** :దళితులు నిరసన తెలిపిన రోడ్లను పసుపు,పాలతో శుద్ధి చేసి దళిత సమాజాన్ని అవమానించిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు డిమాండ్ చేశారు. బుధవారం నాడు బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా లో మాదిగ హక్కుల దండోరా పట్టణ అధ్యక్షుడు ఎనగందుల శివాజీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వాక్యాలకు పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ బాధ్యత తీసుకొని బీఆర్ఎస్ పార్టీ నుండి బహిస్కరించాలని మాదిగ డప్పులతో రోడ్ల మీదకు వచ్చి శాంతియుతంగా నిరసన తెలిపితే బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మేము అంటే మాదిగలు రోడ్ల మీద నిరసన తెలిపితే,దళితులు అంటారని వాళ్ళు ఆ రోడ్లను మైలపరిచారని రోడ్లను పసుపునీళ్ళతో,పాలతో శుద్ధి చేసిన పార్టీ కి చెందిన కొందరు కుల దురహంకారులు చేసిన చర్యను మాదిగ హక్కుల దండోరా తీవ్రంగా ఖండిస్తుందన్నారు. బిఆర్ఎస్ పార్టీకి దళితుల మీద ఎంత వ్యతిరేకత ఉందో సంబంధిత సంఘటనే రుజువు చేస్తుందన్నారు. ఒక దళితుడు ఉన్నత స్థానంలో ,రాజ్యాంగ బద్ధమైన స్పీకర్ పదవిలో ఉంటే ఓర్చుకోలేని అగ్రవర్ణ కుల దురహంకారులు రాజ్యాంగ బద్ధమైన చట్ట సభలో ఉంది కూడా కనీసం రాజ్యాంగ బద్ధమైన స్పీకర్ కుర్చీని కూడా గౌరవించక పోవడం చోచనీయమన్నారు . స్పీకర్ గడ్డం ప్రసాద్ తల్లి ని ఉద్దేశించి సంస్కారం లేకుండా మాట్లాడిన బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాతా మధును పార్టీ నుండి వెంటనే బహిష్కరించాలని డిమాండ్ చేశారు.దళితులను ఏ రాజకీయ పార్టీ అవమానిస్తుందో ఆ పార్టీ దళిత వ్యతిరేక పార్టీ అని, పార్టీలో ఉన్న ఉన్న దళిత నాయకులు స్పందించాలని, దళితులను వ్యతిరేకించిన పార్టీలకు రానున్న ఎన్నికల్లో మా ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెపుతామని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగారపు రమేష్,జిల్లా అధికార ప్రతినిధి గోగర్ల శేఖర్, సీనియర్ నాయకులు దాసరి బానయ్య,సబ్బని రాజనర్సుపట్టణ గౌరవ అధ్యక్షుడు ఆరేపల్లి రమేష్,పట్టణాధ్యక్షుడు ఎనగందుల శివాజీ,పట్టణ ఉపాధ్యక్షుడు బొగే రాజయ్య,పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ సంగే సారయ్య,సీనియర్ నాయకులు మంతెన లింగయ్య,గోగర్ల రమేష్, పట్టణ కార్యదర్శి కడపాక శంకర్,చిలుముల రామకృష్ణ,చెన్నూరు సుధాకర్,గడ్డం నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.



# కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌పై సీపీ ఆకస్మిక తనిఖీ

- సాంకేతికతతో నేర పరిశోధన మరింత సమర్థవంతంగా చేపట్టాలి: సీపీ గౌష్ ఆలం

**కరీంనగర్ మహా** : కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌ను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులు, రిసెప్షన్ కౌంటర్, సిటిజన్ ఫీడ్‌బ్యాక్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ నిర్వహణ, కేసుల దర్యాప్తు, ప్రజలకు అందుతున్న సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.పోలీసింగ్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని సీపీ సూచించారు. CCTNS, eసాక్ష్య (eSaksya), సమన్వయ (Samanvaya) తదితర సాంకేతిక పోర్టల్స్, అప్లికేషన్ల పనితీరును సమీక్షించారు. నేర పరిశోధనలో సాంకేతిక ఆధారాలను సమర్థవంతంగా వినియోగిస్తూ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు పోలీసులపై మరింత నమ్మకం కలిగేలా సేవలు అందించాలని సూచించారు.శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సీపీ గౌష్ ఆలం అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీలో ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, ఎస్సై సాంబమూర్తితో పాటు పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజల్లో చైతన్యం నింపిన కాళోజీ

**కరీంనగర్ మహా**: ప్రజాకవి కాళోజీ నారాయణరావు తన కవిత్వం, రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపారని డిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పద్మవిభూషణ్, ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి ఉత్సవాలను జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు, ఉద్యోగులు, కలెక్టరేట్ సిబ్బంది కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ కాళోజి తన కవితలు, రచనల ద్వారా ప్రజల్లో స్ఫూర్తి నింపారని, ప్రజా అవసరాల కోసం నిరంతరం కృషి చేశారని అన్నారు. తెలంగాణ భాష, సాహితీ సేవకు అంకితమయ్యారని, అణిచివేత, అన్యాయాలపై ధిక్కారస్వరం వినిపించారని అన్నారు. కాళోజి మార్గాన్ని అనుసరించి ప్రజలకు సేవ చేయాలన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఉపాధ్యాయులు

రాజేంద్రనగర్, మహా: మైలార్‌దేవ్‌పల్లిలోని దుర్గా కన్వెన్షన్ హాల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి మండల విద్యాధికారి శంకర్ రాథోడ్, ఉపాధ్యాయులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు, అవార్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తూ, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఉపాధ్యాయుల నిస్వార్థ సేవలు సమాజానికి ఎంతో విలువైనవని అన్నారు.ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్, చంద్రశేఖర్ రెడ్డి, రవి, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మందమర్రి సర్కిల్‌లో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

**పెద్దపల్లి మహా,:** మందమర్రి సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, మహిళల భద్రత, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలీసు అధికారులను. బుధవారం మందమర్రి సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సీపీకి డీసీపీ భాస్కర్, ఏసీపీ కిరణ్ కుమార్, సీఐ పి. రమేష్ స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత, 5S విధానం, రికార్డుల నిర్వహణ, సీజ్ చేసిన వాహనాల వివరాలపై సూచనలు చేశారు. గ్రేవ్ కేసులు, పెండింగ్ కేసులు, సీడీ ఫైళ్లను పరిశీలించిన సీపీ.. దర్యాప్తులను వేగవంతం చేసి పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలతో పోలీసులు మర్యాదగా, స్నేహపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను పరిష్కరించేలా పోలీసింగ్ ఉండాలని సూచించారు. మందమర్రి ప్రాంతంలో రహదారి, రైల్వే రాకపోకలు అధికంగా ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణ, మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, షీ టీమ్స్ కార్యకలాపాలను విస్తృతం చేయాలని తెలిపారు. సింగరేణి గనుల ప్రాంతాల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయాలని ఆదేశించారు. గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు. మత్తు పదార్థాల నియంత్రణకు రాష్ట్రవ్యాప్తంగా ఈగల్ టీమ్స్ పనిచేస్తున్నాయని, గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఇప్పటివరకు రెండింతలు ఎక్కువ కేసులు నమోదయ్యాయని తెలిపారు. మత్తుకు బానిసైన వారికి డీఅడిక్షన్ సెంటర్ల ద్వారా చికిత్స, సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల సహకారంతో రామగుండం కమిషనరేట్‌ను మత్తు పదార్థాల రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని సీపీ స్పష్టం చేశారు.

# అన్యాయాన్ని ఎదిరించడమే కాళోజీ స్ఫూర్తి

**కరీంనగర్ మహా:** ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి, తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు.ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. తెలంగాణ సమాజానికి, తెలుగు సాహిత్యానికి కాళోజీ నారాయణరావు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. "అన్యాయాన్ని ఎదిరిస్తేనే మనిషి" అనే స్ఫూర్తితో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన మహనీయుడు కాళోజీ అని అన్నారు. ఆయన రచనలు, ఆలోచనలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ యాస, భాషకు కాళోజీ తన రచనల ద్వారా ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని సీపీ తెలిపారు. కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించుకోవడం ఆయనకు అందించే ఘనమైన గౌరవమని అన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని కాళోజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.




# ఉచిత కంటి వైద్య పరీక్షలు

**పెద్దపల్లి మహా :** రేకుర్తి కంటి ఆసుపత్రి, కరీంనగర్ వారి ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ మండలంలో ఉచిత కంటి వైద్య పరీక్షల కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం గురువారం ఉదయం 10 గంటలకు శ్రీరాంపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించబడుతుంది.కంటి చూపు సమస్యలు, కంటి చూపులో లోపాలు ఉన్న వారికి వైద్యులచే కంటి పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి రేకుర్తి కంటి ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.కావున మండలంలోని పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి పరీక్షలకు హాజరయ్యే వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు.

## రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో కాళోజీ జయంతి వేడుకలు

పెద్దపల్లి మహా :రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కాళోజీ తన రచనల ద్వారా తెలంగాణ యాస, భాషలో సామాజిక సమస్యలను ప్రజలకు చేరువ చేసి చైతన్యం కలిగించిన గొప్ప ప్రజాకవి అని సీపీ కొనియాడారు. సామాజిక అన్యాయం, అసమానతలు, దోపిడీ, నిరంకుశత్వాన్ని ప్రశ్నిస్తూ సామాన్యుల గొంతుకగా నిలిచారని పేర్కొన్నారు.కాళోజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల సమస్యలను ఓపికగా విని, బాధితులకు న్యాయం చేస్తూ, నిజాయితీ మరియు మానవీయ దృక్పథంతో ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని సిబ్బందికి సీపీ సూచించారు.కార్యక్రమంలో అదనపు డీసీపీ కె. శ్రీనివాస్, ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఏవో శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్‌తో పాటు పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్కు సన్మానం

**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి పట్టణ బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు బుధవారం సబ్ కలెక్టర్ మనోజ్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా బిఎస్ఎస్ సభ్యులు బ్రాహ్మణులకు గోశాల మరియు వేద పాఠశాల, గాయత్రి మాత ఆలయ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కోరారు. సోమవారం మంచిర్యాల కలెక్టర్ సముదాయ భవనంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించినట్టు తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సబ్ కలెక్టర్ మనోజ్ వీలైనంత త్వరలో ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బ్రాహ్మణులకు స్థలం కేటాయించే విధంగా కృషి చేస్తానని తెలిపారు.బెల్లంపల్లి బ్రాహ్మణ సేవా సమితి తరపున కృతజ్ఞతలు తెలుపుతూ వేద పండితుల ద్వారా ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎస్ ముఖ్య సలహాదారు కొమ్మెర లక్ష్మణ్, రాంభట్ల హరీష్ శర్మ,అధ్యక్షుడు విఎల్ఎస్. శ్రీనివాస్, సభ్యులు జగన్మోహన్ చారి, మనోజ్ పాండే,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




# దళితులను అవమానించే ధోరణి బిఆర్ఎస్‌కి తగదు

- కేసీఆర్ ఫామ్‌హౌస్ పసుపు నీళ్ల శుద్ధి ఘటనపై సత్తుపల్లిలో కాంగ్రెస్ నిరసన
- దయానంద్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన..
- భారీగా తరలివచ్చిన దళిత సంఘాల నాయకులు

**సత్తుపల్లి, మహా :** దళితుల పట్ల బీఆర్ఎస్ అగ్రనేతలు వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ ఆధ్వర్యంలో సత్తుపల్లిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ దళిత సంఘాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు కొందరు దళిత కాంగ్రెస్ నాయకులు డబ్బులతో వెళ్లిన సందర్భంలో.. కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాలను పసుపు నీళ్లతో శుద్ధి చేశారంటూ వచ్చిన ఆరోపణలపై నిరసనకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్య దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఉందని వారు మండిపడ్డారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ.. దళితులను చులకనగా చూసే ధోరణిని ఏ మాత్రం సహించబోమని అన్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ విభేదాలు సహజమే అయినప్పటికీ, ఒక వర్గం ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం సరికాదన్నారు. అంబేద్కర్ చూపిన సమానత్వ మార్గంలో అన్ని వర్గాలకు గౌరవం కల్పించాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపై ఉందని పేర్కొన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసనలో దళిత సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు. దీంతో అంబేద్కర్ విగ్రహం పరిసరాల్లో కొంతసేపు నిరసన వాతావరణం నెలకొంది.

# పర్యాటక రంగం అభివృద్ధికి మూడేళ్ల కార్యాచరణ రూపొందించాలి

- రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్
- వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న వరంగల్ జిల్లా కలెక్టర్



**వరంగల్, కలెక్టరేట్ మహా :** ప్రతి జిల్లాలో ఉన్న ప్రత్యేక పర్యాటక సామర్థ్యాన్ని గుర్తించి, పర్యాటక రంగ అభివృద్ధికి మూడేళ్ల సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.బుధవారం రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలు, జ్ఞాన భారతం మిషన్ అమలు పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్ నుండి డాక్టర్ సత్య శారద ఈ వీడియో కాన్ఫెరెన్స్ కి హాజరయ్యారు.

రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు ఒక ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ప్రతి జిల్లాలోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల్లో నిర్వహించాలని తెలిపారు.ప్రతి జిల్లాకు ప్రత్యేకమైన పర్యాటక బలాన్ని గుర్తించి, దానికి అనుగుణంగా జిల్లా పర్యాటక గుర్తింపు, బ్రాండింగ్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు.ప్రతి జిల్లాకు మూడు సంవత్సరాల జిల్లా పర్యాటక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి, అందులో ప్రాధాన్యత కలిగిన పర్యాటక ప్రాంతాలు, అభివృద్ధి చేయాల్సిన ప్రాజెక్టులు, మౌలిక వసతుల అవసరాలు, పెట్టుబడి అవకాశాలు, సందర్శకుల సౌకర్యాలు, ప్రచార కార్యక్రమాలను స్పష్టమైన కాలపరిమితులతో పొందుపరచాలని సూచించారు.పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు పీపీపీ విధానంలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించాలని సూచించారు.జ్ఞాన భారతం మిషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రత్యేక ముఖ్య కార్యదర్శి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ మిషన్‌లో భాగంగా చారిత్రక ప్రదేశాలు, దేవాలయాలు, ఇతర ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న ప్రాచీన గ్రంథాలు, మాన్యుస్క్రిప్టులను గుర్తించి సంరక్షించాలని సూచించారు. ప్రతి జిల్లాలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి, అందుబాటులో ఉన్న మాన్యుస్క్రిప్టుల పై సమగ్ర సర్వే చేపట్టాలని తెలిపారు. ప్రాచీన గ్రంథాలను డిజిటలైజ్ చేసి భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి జిల్లా తమ పరిధిలో అందుబాటులో ఉన్న మాన్యుస్క్రిప్టుల వివరాలతో సమగ్ర నివేదిక సమర్పించాలని తెలిపారు. తెలుగు పండితులు, ఉర్దూ పండితులు, ఇతర భాషల నిపుణుల వద్ద ఉన్న ప్రాచీన గ్రంథాల వివరాలను సేకరించి వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. జ్ఞాన భారతం మిషన్ అమలుకు నోడల్ అధికారిని నియమించాలన్నారు. జిల్లా పర్యాటక గుర్తింపు, బ్రాండింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏ. వాణి ప్రసాద్ తెలిపారు. జిల్లా బ్రాండింగ్‌తో పాటు ఫిల్మ్ టూరిజం, ప్రపంచ పర్యాటక దినోత్సవం వంటి కార్యక్రమాల ద్వారా పర్యాటక ప్రాంతాలకు మరింత ప్రచారం కల్పించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, డిఆర్వో విజయ లక్ష్మి, ఎడి ఆర్కియాలజీ గంగా, జిల్లా ఇంచార్జ్ టూరిజం శాఖ అధికారి పాల్గొన్నారు.

# ప్రజాకవి కాళోజీ జీవితం ఆదర్శనీయం

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- కాళోజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎంపీ, జిల్లా కలెక్టర్



**హనుమకొండ, మహా :** ప్రజాకవి కాళోజీ నారాయణరావు తన కలం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని, చైతన్య స్ఫూర్తిని కలిగించిన కాళోజీ జీవితం ఆదర్శనీయమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. కాళోజీ జయంతిని పురస్కరించుకుని బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహానికి ఎంపీ డాక్టర్ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత అంపశయ్య నవీన్, తదితర ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ తెలంగాణ భాషా దినోత్సవాన్ని కాళోజీ జయంతి సందర్భంగా నిర్వహించు కోవడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు, ఇబ్బందులను తన రచనల ద్వారా ఎప్పటికప్పుడు ప్రజల ముందుకు తీసుకువెళ్లి, వారిలో చైతన్యం నింపిన కాళోజీ నేటి తరానికి ఆదర్శప్రాయుడని అన్నారు. తెలంగాణ సాధన ఉద్యమంలో కాళోజీ సాహిత్య స్ఫూర్తి, ఆయన రచనలు ప్రజల్లో గొప్ప చైతన్యాన్ని నింపాయని అన్నారు. కాళోజీ వరంగల్‌కు చెందిన వారు కావడం గర్వకారణం అని తెలిపారు. ప్రజాకవి కాళోజీ రచనలు, సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని, ముఖ్యంగా యువత కాళోజీ ఆలోచనా విధానాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి శుభాకాంక్షలను ప్రజలందరికీ ఎంపీ కడియం కావ్య తెలిపారు.ఈ సందర్భంగా పలువురు కాళోజీ నారాయణ రావు ఆశయాలను కొనసాగిద్దామని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, కాళోజీ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగిళ్ల రామశాస్త్రి, వీఆర్ విద్యార్థి, కోశాధికారి పందిళ్ల అశోక్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఆగపాటి రాజ్ కుమార్, సంయుక్త కార్యదర్శి పొట్లపల్లి శ్రీనివాస రావు, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఈ.వి. శ్రీనివాసరావు, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు, పలువురు కవులు, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

**కాళోజి కళాక్షేత్రంలో..**

ప్రజాకవి కాళోజీ జయంతిని పురస్కరించుకొని హనుమకొండ బాలసముద్రంలోని కాళోజి కళాక్షేత్రంలో కాళోజీ నారాయణ రావు విగ్రహానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుడా సిపీవో అజిత్ రెడ్డి, ఈఈ బీమ్ రావు, తదితరులు పాల్గొన్నారు.



## మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

**కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి**

**హనుమకొండ, మహా :** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్ గుండు సుధారాణి పిలుపునిచ్చారు.వినాయక చవితి సందర్భంగా పర్యావరణ హితాన్ని చాటే విధంగా "మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం" అనే సందేశంతో రూపొందించిన పోస్టర్‌ను బుధవారం కుడా కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. వినాయక చవితి మన ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీక అని, అదే సమయంలో ప్రకృతిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యతను కూడా గుర్తుచేసే పండుగగా జరుపుకోవాలని అన్నారు. మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించడం ద్వారా భక్తిని చాటడంతో పాటు చెరువులు, నదులు, నీటి వనరులను కాలుష్యం నుంచి కాపాడవచ్చని తెలిపారు.పర్యావరణ హితమైన వినాయక చవితి నిర్వహణ కు ప్రజలు, యువత, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కూడా ప్రాజెక్ట్ ఆఫీసర్ అజిత్ రెడ్డి, ఈఈ భీమారావు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాకవి కాళోజీ జీవితం నేటి, రేపటి తరాలకు మార్గదర్శకం

**ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి.**

**కుషాయిగూడ, మహా:** ప్రజాకవి, తెలంగాణ వైతాళికుడు, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి ఆయనకు నివాళులర్పించారు. తెలంగాణ సమాజం ఉన్నంతకాలం కాళోజీ చేసిన పోరాటం, ఆయన జ్ఞాపకాలు పదిలంగా ఉంటాయని అన్నారు. కాళోజీ తన సాహిత్యం ద్వారా ప్రజల సమస్యలు, సామాజిక అసమానతలు, పాలకుల వైఖరిని ప్రశ్నిస్తూ ప్రజల్లో చైతన్యం రగిలించారని పేర్కొన్నారు. 'నా గొడవ' వంటి రచనలతో సామాన్యుడి గొంతుకగా నిలిచారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంతో పాటు ప్రజాస్వామ్య విలువలు, మానవ హక్కుల కోసం జీవితాంతం పోరాడారని తెలిపారు. ఆయన రచనల్లో తెలంగాణ ప్రజల జీవన విధానం, యాస, భాష, సంస్కృతి ప్రతిబింబించాయన్నారు.నిజాం పాలనలో జైలు నాలుగు గోడల మధ్య బంధించినా కాళోజీ ప్రజా కవిత్వం మరింత పదునెక్కిందని పేర్కొన్నారు. 'ఓ నిజాం పిశాచి' అంటూ పాలకుల దమనకాండను ప్రశ్నించిన ఆయన ధైర్యం స్ఫూర్తిదాయకమన్నారు. కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం ఆయనకు దక్కిన అరుదైన గౌరవమన్నారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతికి కాళోజీ చేసిన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు.

## డా కమర్షియల్ ప్లాట్ల బహిరంగ వేలానికి ప్రీ-బిడ్ సమావేశం

**కుడా వైస్ చైర్‌పర్సన్, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

**హనుమకొండ, మహా ;** కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఆధ్వర్యంలో కమర్షియల్ ప్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు ప్రజల నుంచి ముందస్తు అభిప్రాయాలు, సూచనలు స్వీకరణ నిమిత్తం నేడు 10వ తేదీకుడా కార్యాలయంలో మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రీ బిడ్ సమావేశం నిర్వహించ నున్నట్లు కుడా వైస్ చైర్‌పర్సన్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుడా పరిధిలోని వాణిజ్య స్థలాల బహిరంగ వేలానికి సంబంధించి ఆసక్తి గల ప్రజలు, వ్యాపారులు ప్రీ బిడ్ సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని, వైస్ చైర్ పర్సన్ సూచించారు.

## ఆర్థిక విధ్వంసంతో సంక్షేమ పథకాలకు నిధుల కొరత

**అసెంబ్లీలో బిఆర్ఎస్ పై ఎమ్మెల్యే నాయిని గరం**



**హనుమకొండ, మహా :** గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీయడంతో ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయడంలో అనేక సవాళ్లు ఎదుర్కొంటోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సభా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలను కనుగొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందుకు సభ్యులు సహకరించాలని ఎమ్మెల్యే నాయిని కోరారు. సభలో సమయం ఇస్తామని చెప్పినప్పటికీ చర్చకు కూర్చోకుండా వివిధ రకాల ఆందోళనలకు దిగడం సరైన పద్ధతి కాదన్నారు.ప్రతిపక్ష నేతలు, ఇతర నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు, వ్యవహరిస్తున్న తీరు పై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. బాధ్యతా యుతమైన ప్రజాప్రతినిధులుగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, బ్లాక్‌మెయిల్ రాజకీయాలు, బెదిరింపుల ధోరణికి స్వస్తి పలకాలని సూచించారు.ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భద్రత విషయంలోనూ ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఏవైనా అనుమానాలు ఉంటే వాటిపై సమగ్రంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నాయిని సభలో కోరారు. ప్రజాధనం, అసెంబ్లీ సమయం వృథా కాకుండా సభలో చర్చల ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, బాధ్యతారహితమైన వ్యవహారశైలిని ప్రజలు ఎప్పటికీ ఆమోదించరని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన నిర్ణయాలు తీసుకుని సభా గౌరవాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సభాపతిని కోరారు

## గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

**కరపత్రాన్ని ఆవిష్కరించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**

హనుమకొండ, మహా ; చారిత్రక వేయి స్తంభాల దేవాలయంలో శ్రీ ఉత్తిష్ఠ గణపతి నవరాత్రి మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఆవిష్కరించారు. సెప్టెంబర్ 14 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న నవరాత్రి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో విజయవంతం చేయాలని ఎంపీ ఆకాంక్షించారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆలయంలోని శ్రీ రుద్రేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక, చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన వేయిస్తంభాల ఆలయంలో నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య ఆకాంక్షించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, కార్యక్రమాలను సంప్రదాయ బద్ధంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డి. అనిల్ కుమార్, ప్రధానార్చకులు గంగు ఉపేంద్ర శర్మ, మణికంఠ అవధాని, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతకు షీ టీం భరోసా

**షీ టీం ఎస్సై రావెల్ల రామారావు**

హనుమకొండ, మహా : నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో అందరు భాగస్వామ్యం కావాలని తమవంతు బాధ్యతలను నిర్వర్తించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల మహిళల మీద జరిగే నేరాలను అదుపు చేయవచ్చని వరంగల్ షీ టీమ్ ఎస్సై రామారావు అన్నారు. హన్మకొండలోని అవినాష్ కాలేజీ లో దాదాపు 200మంది విద్యార్థినిలతో సైబర్ నేరాలు, మహిళల పై జరిగే అత్యాచారాలు, మహిళల పై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ సందర్భంగా వరంగల్ షీ టీమ్ ఎస్సై రామారావు మాట్లాడుతూ అమ్మాయిలు ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్ చాట్, టెలిగ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాల పై,అవగహన కలిగివుండాలని మహిళలు ఒంటరిగా తెలియని ప్రదేశాలకు ప్రయాణం చేయవలసి వచ్చినప్పుడు అందరు టీసేఫ్ ఆప్ ను ఉపయోగించుకోవాలని, టీసేఫ్ ఆప్ పై అవగాహన కలిగి ఉండాలని, ఉద్యోగాలు చేసే మహిళలకు తాము పనిచేసే ప్రదేశాలలో అసభ్యకరంగా ప్రవర్తించే వారి పట్ల, ఆకతాయిల పట్ల జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వారితో తమ వ్యక్తిగత విషయాలు పంచుకోరాదని సూచించారు. ఎవరైనా మహిళల పై అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్టైతే ధైర్యంగా వెంటనే షీ టీమ్ పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ 1930 కి ఫిర్యాదు చేయాలని, మా షీ టీమ్ మొబైల్ నంబర్స్ సీపీ గారి వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142, ఎస్ఐ వాట్సాప్ నెంబర్ 8712685270కు ఫిర్యాదు చేసిన వారి వివరాలను చాలా గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జెఎస్ఎం స్కూల్ డైరెక్టర్ రమేష్ రావు ప్రిన్సిపాల్ శ్రీదేవి అడిమిన్ సతీష్, ఉపాధ్యాయులు, షీ టీమ్ ఎస్సై రావెల్ల రామారావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అడవి పంది మాంసాన్ని విక్రయిస్తున్న నిందితుల అరెస్టు

**బెల్లంపల్లి ఎఫ్ఆర్ఓ సిహెచ్ . పూర్ణచందర్**

**బెల్లంపల్లి ,మహా:** బెల్లంపల్లి రేంజ్ పరిధి లోని అడవిలో అడవి పందిని వేటాడి మాంసాన్ని విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు బెల్లంపల్లి ఎఫ్ఆర్ఓ సిహెచ్ పూర్ణచందర్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మారావు పేట సెక్షన్ ధర్మారావుపేట బీట్ పరిధిలో బుగ్గగూడ గ్రామ సమీపంలోని పత్తిచేనులో అడవిపంది మాంసంతో సంకుర్తల శ్రీకాంత్ పట్టుబడ్డాడు. అటవీశాఖ అధికారులకు అందిన ముందస్తు సమాచారం మేరకు సంఘటనా స్థలంలో గాలింపు చేపట్టగా శ్రీకాంత్ వద్ద అడవిపంది మాంసం లభించింది. విచారణలో అడవి పందిని వేటాడి చంపినట్లు శ్రీకాంత్ అంగీకరించడంతో పాటు, మాంసం కొనుగోలు చేసేందుకు వచ్చిన మరో ఇద్దరు వ్యక్తులు శ్రీనివాస్,రంజిత్ ఉన్నట్లు వెల్లడించారు. ముగ్గురు వ్యక్తులు నేరాన్ని అంగీకరించినట్లు అధికారులు తెలిపారు.ఈ మేరకు ముగ్గురి పై సంబంధిత అటవీ చట్టాల ప్రకారం కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి రేంజ్ ఆఫీసర్ పూర్ణచందర్ తెలిపారు.



## పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

**దమ్మపేట ,మహా :** ప్రముఖ ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు వక్తృత్వ, వ్యాచారచన, చిత్రలేఖనం, పాటల పోటీలు జూనియర్ సీనియర్ విభాగాలుగా నిర్వహించి బహుమతులు అందజేశారు. తెలంగాణ భాషా దినోత్సవం విశిష్టతను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు విద్యార్థుల కు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి. ఉషారాణి , తెలుగు భాష ఉపాధ్యాయులు వసంత కుమారి, విజయ, చందులాల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఆదిభట్లలో ప్రజాకవి కాళోజి జయంతి వేడుకలు..

ఆదిభట్ల సెప్టెంబర్ 9 మహా: తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను, డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఆదిభట్ల సర్కిల్ 15 కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ... తెలంగాణ భాష, సంస్కృతి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం కాళోజీ చేసిన కృషి మరువలేనివని పేర్కొన్నారు. ఆయన రచనలు నేటి తరానికి కూడా స్ఫూర్తినిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఈఈ బిక్షపతి, ఏఎంసి శ్రీనివాసులు, ఏఈ చంద్ర శేఖర్ రెడ్డి, ఏఎంఓహెచ్ శారద కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.




మహా పత్రిక



WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | గురువారం, హైదరాబాద్ | 10-09-2026

# 90s లుక్‌లో నైర్రా బెనర్జీ



90ల నాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తూ నటి నైర్రా ఎం. బెనర్జీ తన లేటెస్ట్ ఫొటోషూట్‌తో సోషల్ మీడియాలో సందడి చేసింది. "Locked in the 90s" అంటూ షేర్ చేసిన ఈ ఫొటోలు ప్రస్తుతంఅభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. రెట్రో ఫ్యాషన్, క్లాసిక్ గ్లామర్, అప్పటి కాలేజ్ గర్ల్ లుక్‌ను తనదైన స్టైల్‌లో ప్రెజెంట్ చేస్తూ నైర్రా అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా డెనిమ్ అవుట్‌ఫిట్‌లో కనిపించిన ఆమె లుక్ 90ల నాటి కాలేజ్ డేస్‌ను గుర్తు చేసేలా ఉంది. మరోవైపు లైట్ బ్లూ కలర్ చీరలో సంప్రదాయ అందంతో మెరిసిన నైర్రా, పాత తరం బాలీవుడ్ కథానాయికల గ్లామర్‌ను గుర్తు చేసింది.నైర్రా ఎం. బెనర్జీ కెరీర్‌ను తెలుగు సినిమాతో ప్రారంభించింది. 2009లో విడుదలైన 'ఆ ఒక్కాడు' చిత్రంతో ఫీచర్ ఫిల్మ్‌లోకి అడుగుపెట్టిన ఆమె, ఆ తర్వాత వివిధ భాషల్లో అవకాశాలను అందిపుచ్చుకుంది. ప్రియదర్శన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కమాల్ ధమాల్ మలామాల్' చిత్రంతో హిందీ చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. తెలుగు, హిందీతో పాటు తమిళ, మలయాళ సినిమాల్లోనూ నటిస్తూ తన కెరీర్‌ను విస్తరించింది. విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ నటిగా తనలోని వేరియేషన్స్‌ను చూపించింది. తెలుగులో 'టెంపర్', 'కొత్త జంట' వంటి సినిమాల్లో కనిపించిన నైర్రా, హిందీలో 'వన్ నైట్ స్టాండ్' వంటి చిత్రాలతోనూ ప్రేక్షకులకు పరిచయమైంది. సినిమాలతో పాటు టెలివిజన్ రంగంలోనూ ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. ముఖ్యంగా 'దివ్య దృష్టి' సీరియల్‌లో టైటిల్ రోల్‌లో నటించి భారీ స్థాయిలో ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంది. అనంతరం 'పిశాచిని' వంటి హారర్ థ్రిల్లర్ సిరీస్‌లోనూ ప్రధాన పాత్ర పోషించి తన నటనతో మెప్పించింది. టీవీ, ఓటీటీ రంగాల్లో వరుస అవకాశాలు రావడంతో నైర్రా తన క్రేజ్‌ను మరింత పెంచుకుంది. నైర్రా ప్రత్యేకత కేవలం నటనకే పరిమితం కాదు. ఫ్యాషన్ విషయంలోనూ ఆమె ఎప్పటికప్పుడు కొత్త ప్రయోగాలు చేస్తుంటుంది. మోడ్రన్ అవుట్‌ఫిట్స్ నుంచి ట్రెడిషనల్ చీరల వరకు విభిన్న లుక్‌లలో కనిపిస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. తాజాగా 90ల ట్రెండ్‌ను ఎంచుకోవడం కూడా అందులో భాగమే. అప్పటి ఫ్యాషన్ స్టైల్‌ను నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా ప్రెజెంట్ చేయడంతో ఆమె ఫొటోలకు మంచి స్పందన వస్తోంది. డెనిమ్ లుక్‌లో యంగ్ అండ్ క్యాజువల్ వైబ్‌ను చూపించిన నైర్రా, చీరలో మాత్రం సింపుల్ అండ్ ఎలిగెంట్ లుక్‌తో ఆకట్టుకుంది.ఇక కెరీర్ పరంగా కూడా నైర్రా ప్రస్తుతం బిజీగా ఉంది. థియేట్రికల్ సినిమాలతో పాటు ఓటీటీ ప్రాజెక్టుల్లోనూ వరుసగా కనిపిస్తోంది. నీరజ్ పాండే తెరకెక్కించిన నెట్‌ఫ్లిక్స్ క్రైమ్ డ్రామా సిరీస్ 'ఖాకీ: ది బెంగాల్ చాప్టర్'లోనూ ఆమె నటించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. క్రైమ్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ సిరీస్‌లో తన పాత్రకు తగ్గట్టుగా నటిస్తూ మరోసారి తనలోని పెర్ఫార్మర్‌ను చూపించింది.అదే సమయంలో పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న కామెడీ చిత్రం 'వన్ టూ చా చా చా'లోనూ నైర్రా కీలక పాత్రలో కనిపించనుంది. ఆశుతోష్ రాణాతో కలిసి నటిస్తున్న ఈ సినిమా ద్వారా మరోసారి ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసేందుకు సిద్ధమవుతోంది. ఒకవైపు సినిమాలు, మరోవైపు ఓటీటీ ప్రాజెక్టులు, టెలివిజన్ షోలు చేస్తూ తన కెరీర్‌ను విభిన్న మార్గాల్లో ముందుకు తీసుకెళ్తోంది. తాజాగా 90ల లుక్‌లో నైర్రా కనిపించిన తీరు ఆమె అభిమానుల్లో నాస్టాల్జియాను రేకెత్తిస్తోంది. అప్పటి ఫ్యాషన్ ట్రెండ్‌ను గుర్తుచేసే డెనిమ్ స్టైల్, లైట్ బ్లూ చీర, సహజమైన పోజులతో ఆమె ఫొటోషూట్ ప్రత్యేకంగా నిలిచింది. దీంతో నైర్రా కొత్త ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. గ్లామర్‌తో పాటు విభిన్న పాత్రల్లో నటించే సామర్థ్యం ఉన్న నైర్రా, రాబోయే రోజుల్లో మరిన్ని ఆసక్తికరమైన ప్రాజెక్టులతో ప్రేక్షకులను అలరించే అవకాశం కనిపిస్తోంది.





# టాక్సిక్ టాక్‌పై యశ్ రియాక్షన్ ఇదే!

రాకింగ్ స్టార్ యశ్ హీరోగా తెరకెక్కిన 'టాక్సిక్' చిత్రం విడుదలకు ముందే భారీ అంచనాలను క్రియేట్ చేసింది. యశ్‌కి ఉన్న క్రేజ్‌తో పాటు దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన విధానం సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. అయితే థియేటర్లలోకి వచ్చిన తర్వాత మాత్రం ఈ మూవీకి ప్రేక్షకులు, సినీ విశ్లేషకుల నుంచి భిన్నమైన స్పందనలు ఎదురయ్యాయి. కొంతమంది సినిమాను మెచ్చుకోగా, మరికొందరు ఆశించిన స్థాయిలో లేదంటూ అభిప్రాయపడ్డారు. దీంతో తొలిరోజే మిక్స్‌డ్ టాక్ వినిపించింది. ఈ నేపథ్యంలో సినిమాకు వచ్చిన నెగెటివ్ రివ్యూలపై యశ్ ఎలా స్పందించారనే విషయం ఆసక్తికరంగా మారింది. తాజాగా 'టాక్సిక్'కు డబ్బింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేసిన నటుడు జైదేవ్ మోహన్.. యశ్‌తో జరిగిన సంభాషణకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సినిమా విడుదలైన రోజే యశ్ తనకు ఫోన్ చేసినట్లు ఆయన తెలిపారు. ఫోన్‌లో యశ్ చాలా కూల్‌గా మాట్లాడారని జైదేవ్ మోహన్ చెప్పారు. సినిమా గురించి వచ్చిన ప్రతికూల స్పందనను చూసి ఎక్కువగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని యశ్ చెప్పినట్లు తెలిపారు. సినిమా విషయంలో తమ వంతు ప్రయత్నం చేశామని, ఇక ప్రేక్షకుల తీర్పును అంగీకరించాల్సిందేననే అభిప్రాయాన్ని యశ్ వ్యక్తం ిసేనట్లు వెల్లడించారు.ప్రేక్షకులే చివరికి సినిమా విజయాన్ని నిర్ణయిస్తారని, వారికి నచ్చితే ఆదరిస్తారని, నచ్చకపోతే ఆ నిర్ణయాన్ని కూడా గౌరవించాల్సిందేనని యశ్ చెప్పినట్లు జైదేవ్ మోహన్ వివరించారు. ఫలితం గురించి ఎక్కువగా ఆలోచిస్తూ బాధపడటం కంటే, ముందున్న పనులపై దృష్టి పెట్టడం మంచిదని యశ్ సూచించినట్లు తెలిపారు.అయితే యశ్ మాటల్లో ధైర్యం ఉన్నప్పటికీ.. సినిమా విషయంలో ఆయనకు బాధ లేదని మాత్రం చెప్పలేమని జైదేవ్ మోహన్ పేర్కొన్నారు. ఆయనతో మాట్లాడుతున్న సమయంలో స్వరంలో కొంత నిరాశ కనిపించిందని చెప్పారు. ఒక సినిమాకు చాలా కాలం పాటు కష్టపడి పనిచేసిన తర్వాత తొలి రోజే నెగెటివ్ స్పందన రావడం చిత్రబృందాన్ని మానసికంగా ప్రభావితం చేయడం సహజమేనని అన్నారు. 'టాక్సిక్'పై భారీ అంచనాలు ఉండటానికి యశ్ గత చిత్రాల సక్సెస్‌తో పాటు ఈ ప్రాజెక్ట్ కాంబినేషన్ కూడా కారణమైంది. ముఖ్యంగా యశ్ - గీతూ మోహన్‌దాస్ కాంబినేషన్ ప్రకటించినప్పటి నుంచే అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. భారీ స్థాయిలో రూపొందిన ఈ చిత్రంపై రిలీజ్‌కు ముందే సోషల్ మీడియాలో విపరీతమైన చర్చ జరిగింది. అయితే విడుదల తర్వాత సినిమాకు ఆశించిన స్థాయిలో ఏకగ్రీవమైన స్పందన రాకపోవడంతో బాక్సాఫీస్ ఫలితంపై కూడా చర్చ మొదలైంది. సోషల్ మీడియాలో కొందరు సినిమాను ప్రశంసిస్తుండగా, మరికొందరు కథనం, స్క్రీన్‌ప్లే, ట్రీట్‌మెంట్‌పై విమర్శలు చేశారు. ఇలాంటి పరిస్థితిలో యశ్ స్పందించిన విధానం ఇప్పుడు ప్రత్యేకంగా చర్చకు వస్తోంది. నెగెటివ్ రివ్యూలను పట్టించుకోకుండా ప్రేక్షకుల నిర్ణయాన్ని గౌరవించాలని ఆయన చెప్పినట్లు వెల్లడవడం అభిమానులను ఆకట్టుకుంటోంది. సినిమా ఫలితం ఏదైనా దానిని స్వీకరించి తదుపరి ప్రాజెక్ట్‌లపై దృష్టి పెట్టాలనే యశ్ ఆలోచన ఆయన ప్రొఫెషనల్ యాటిట్యూడ్‌ను చూపిస్తోందని అభిమానులు అంటున్నారు. మొత్తానికి 'టాక్సిక్'కు వచ్చిన మిక్స్‌డ్ టాక్ కంటే.. ఆ స్పందనపై యశ్ తీసుకున్న వైఖరి ఇప్పుడు సోషల్ మీడియాలో ఎక్కువగా చర్చనీయాంశమవుతోంది. ప్రేక్షకుల తీర్పును గౌరవిస్తూ ముందుకు సాగాలన్న ఆయన మాటలు అభిమానుల్లో మంచి స్పందనను తెచ్చుకుంటున్నాయి.








# అవకాశాలు రాకపోతే.. మన దారిని మనమే వేసుకోవాలి!

సినీ పరిశ్రమలో ప్రతిభ ఉన్నంత మాత్రాన ప్రతి ఒక్కరికీ వెంటనే అవకాశాలు దక్కుతాయని చెప్పలేం. వచ్చిన ఛాన్స్‌ను సద్వినియోగం చేసుకోవడం ఎంత అవసరమో.. అవకాశం రాని సమయంలోనూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా ముందుకు సాగడం అంతే కీలకం. మన సామర్థ్యాన్ని ఇతరుల అంచనాలతో నిర్ణయించుకోకూడదని ప్రముఖ యాంకర్, నటి, నిర్మాత ఉదయభాను అభిప్రాయపడ్డారు. ఎవరైనా మనకు హద్దులు పెట్టినా.. మనలో ఉన్న సామర్థ్యం మనకు తెలుసని, అందుకే మనపై మనకు నమ్మకం ఉండాలని ఆమె సూచించారు.ఇటీవల 'పంచనామా' వెబ్ సిరీస్ ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న ఉదయభాను తన కెరీర్ ప్రయాణంలో ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. జీవితంలో కొత్తగా ఏదైనా చేయాలని ప్రయత్నించినప్పుడు చుట్టూ ఉన్నవాళ్లు ఎన్నో సందేహాలు వ్యక్తం చేస్తారని ఆమె అన్నారు. మనం అనుకున్నది సాధించగలమా లేదా అనే ప్రశ్నలను చాలామంది వేస్తారని, కొందరు మన సామర్థ్యానికి ఒక పరిమితిని నిర్ణయించే ప్రయత్నం చేస్తారని తెలిపారు.అయితే ఇతరులు పెట్టే పరిమితులను పట్టించుకోవాల్సిన అవసరం లేదని ఉదయభాను అన్నారు. మనలో ఉన్న బలం, మనం ఎంత దూరం వెళ్లగలమనే విషయం పూర్తిగా మనకే తెలుసని పేర్కొన్నారు. బయటివాళ్లు మన గురించి ఒక అభిప్రాయాన్ని ఏర్పరచుకోవచ్చు కానీ.. మన పూర్తి సామర్థ్యాన్ని వాళ్లు అంచనా వేయలేరని ఆమె చెప్పారు. అందుకే ఇతరుల మాటల ఆధారంగా మన నిర్ణయాలను మార్చుకోకుండా, మనపై మనమే విశ్వాసం పెట్టుకోవాలని సూచించారు. జీవితంలో ఏదైనా అవకాశం చేజారినప్పుడు దాని గురించే ఆలోచిస్తూ అక్కడే ఆగిపోవడం సరికాదని ఉదయభాను తెలిపారు. ఒక మార్గం మూసుకుపోతే మరో అవకాశం కోసం ప్రయత్నించాలి కానీ.. అదే తలుపు ఎప్పుడు తెరుచుకుంటుందా అని ఎదురుచూస్తూ సమయాన్ని వృథా చేయకూడదన్నారు. అవసరమైతే మనకు కావాల్సిన అవకాశాన్ని మనమే సృష్టించుకోవాలని చెప్పారు.ఉదయభాను చెప్పిన ఈ మాటలు ఆమె వ్యక్తిగత ప్రయాణానికి కూడా దగ్గరగా ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. యాంకర్‌గా కెరీర్‌ను ప్రారంభించిన ఆమె.. ఆ తర్వాత నటిగా తనను తాను నిరూపించుకున్నారు. వివిధ కార్యక్రమాలు, సినిమాలు, టెలివిజన్ ప్రాజెక్టుల ద్వారా ప్రేక్షకులకు దగ్గరైన ఆమె ఇప్పుడు నిర్మాతగా మరో కొత్త అడుగు వేశారు.అవకాశాల కోసం ఎదురు చూడటం కంటే.. తానే ఒక ప్రాజెక్ట్‌ను రూపొందించాలనే ఆలోచనతో 'పంచనామా' వెబ్ సిరీస్ నిర్మాణంలోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఉదయభాను ప్రొడక్షన్స్ బ్యానర్‌పై మిద్దే విజయేంద్ర మౌళితో కలిసి ఆమె ఈ వెబ్ సిరీస్‌ను నిర్మించారు. దీంతో యాంకర్, నటిగా ఇప్పటికే గుర్తింపు తెచ్చుకున్న ఉదయభాను ఇప్పుడు నిర్మాతగానూ తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.ఇక 'పంచనామా' విషయానికి వస్తే.. ఇది క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా రూపొందింది. ఆరు ఎపిసోడ్లుగా తెరకెక్కిన ఈ సిరీస్‌కు మోహన్ శ్రీవత్స్ దర్శకత్వం వహించారు. తమిళ నటుడు భరత్ ఇందులో పోలీస్ అధికారి జై రామ్ పాత్రలో కనిపించనున్నారు. శివాజీ రాజా, మేధా రెడ్డి, చరణ్ బాబు, రూప లక్ష్మి, రాధిక ప్రీతి తదితరులు కీలక పాత్రలు పోషించారు.కథ విషయానికి వస్తే.. ఒక వ్యక్తి మరణాన్ని మొదట సాధారణ ప్రమాదంగా భావిస్తారు. అయితే కేసును పరిశీలిస్తున్నకొద్దీ కొన్ని అనుమానాస్పద అంశాలు పోలీసుల దృష్టికి వస్తాయి. దీంతో ఈ ఘటన వెనుక అసలు కారణమేంటో తెలుసుకునేందుకు పోలీస్ అధికారి జై రామ్ దర్యాప్తును ప్రారంభిస్తాడు. విచారణ ముందుకు సాగుతున్న కొద్దీ మరో రెండు మరణాలతో ఈ ఘటనకు సంబంధం ఉన్నట్లు అతడికి అనుమానం కలుగుతుంది. మూడు మరణాల మధ్య ఉన్న సంబంధాన్ని తెలుసుకునే క్రమంలో జై రామ్‌కు అనేక అనూహ్య విషయాలు ఎదురవుతాయి. ఒక్కో ఆధారం బయటపడే కొద్దీ కేసు మరింత సంక్లిష్టంగా మారుతుంది. రాజకీయ అవినీతి, నేరపూరిత కుట్రలు, రహస్యాలు, అనూహ్య మలుపులతో కథను ఆసక్తికరంగా తీర్చిదిద్దినట్లు చిత్రబృందం చెబుతోంది. 'పంచనామా' వెబ్ సిరీస్ సెప్టెంబర్ 11 నుంచి జీ5లో స్ట్రీమింగ్‌కు రానుంది. క్రైమ్, ఇన్వెస్టిగేషన్, మిస్టరీ అంశాలను ఇష్టపడే ప్రేక్షకులకు ఈ సిరీస్ ఆసక్తికరంగా ఉండే అవకాశం ఉంది. నిర్మాతగా ఉదయభాను ఎంచుకున్న ఈ కొత్త ప్రయోగం ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో, జై రామ్ దర్యాప్తు ప్రేక్షకులను ఎంతవరకు థ్రిల్ చేస్తుందో తెలియాలంటే సిరీస్ స్ట్రీమింగ్ వరకు వేచి చూడాల్సిందే.

## సినిమా కోసం ఇద్దరి మధ్య
# తరచూ గొడవలట..

ఒక సినిమాను తెరపైకి తీసుకురావడానికి దర్శకుడు, నిర్మాత కలిసి పనిచేసే సమయంలో అభిప్రాయ భేదాలు రావడం సాధారణమే. కథను ఎలా చెప్పాలి, సన్నివేశాలను ఏ విధంగా తెరకెక్కించాలి, సంగీతం ఎక్కడ ఉండాలి వంటి విషయాల్లో ఒక్కొక్కరికి ఒక్కో ఆలోచన ఉండొచ్చు. తాజాగా నిర్మాత సూర్యదేవర నాగవంశీ కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించారు. దర్శకుడు ఆదిత్య హాసన్‌తో సినిమా విషయంలో అప్పుడప్పుడు వాదనలు జరుగుతుంటాయని ఆయన వెల్లడించారు. తమ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' మూవీ ప్రమోషన్‌లో పాల్గొన్న నాగవంశీ.. దర్శకుడు ఆదిత్యతో తనకు ఎదురయ్యే క్రియేటివ్ డిస్కషన్స్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. దర్శకుడి వ్యక్తిగత జీవితంలోని ప్రతి అనుభవాన్ని సినిమాలోకి తీసుకురావాల్సిన అవసరం లేదని తాను తరచూ చెబుతుంటానని ఆయన తెలిపారు.ఆదిత్యకు సినిమా, వ్యక్తిగత జీవితం రెండూ వేర్వేరు విషయాలని వివరిస్తుంటానని నాగవంశీ అన్నారు. నిజ జీవితంలో ఎదురైన ప్రతి సంఘటనను స్క్రీన్‌పై చూపించాల్సిన అవసరం లేదని, కథకు ఉపయోగపడే అంశాలను మాత్రమే ఎంచుకోవాలని సూచిస్తుంటానని చెప్పారు. సినిమా ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని అవసరమైనంత వరకు వాస్తవికతను ఉపయోగించుకోవడంతో పాటు, కథకు అనుగుణంగా కొన్ని కల్పిత సన్నివేశాలను కూడా రూపొందించడంలో తప్పు లేదని ఆయన అభిప్రాయపడ్డారు.సినిమా అనేది వాస్తవ జీవితానికి అచ్చుగుద్దినట్లు ఉండాల్సిన అవసరం లేదని నాగవంశీ పేర్కొన్నారు. కథను మరింత ఆసక్తికరంగా మార్చేందుకు కొన్ని సన్నివేశాలను సినిమాటిక్‌గా రూపొందించవచ్చని చెప్పారు. ఇందుకు ఉదాహరణగా ఎంఎస్ ధోనీ జీవితంపై తెరకెక్కిన బయోపిక్‌ను ప్రస్తావించారు. ఆ సినిమాలో కనిపించే కొన్ని సంఘటనలు నిజ జీవితంలో అదే విధంగా జరిగాయా లేదా అనేది తెలియకపోయినా.. కథనానికి అవసరమైన విధంగా వాటిని సినిమాలో చూపించారని వివరించారు. అదే విధంగా 'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్'లోనూ ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా కొన్ని సన్నివేశాలను క్రియేట్ చేయాలని తాను చెబుతుంటానని నాగవంశీ వెల్లడించారు. అయితే దర్శకుడు ఆదిత్య హాసన్ తన ఆలోచనలకు అనుగుణంగా సన్నివేశాలను తెరకెక్కించాలనుకుంటారని, ఈ విషయంలో ఇద్దరి మధ్య చర్చలు జరుగుతుంటాయని తెలిపారు. ఇటీవల కూడా ఒక కీలక సన్నివేశం విషయంలో తమ మధ్య చర్చ కాస్త వాదనగా మారిందని నాగవంశీ చెప్పారు. సినిమాలోని ఒక లీడ్ సీన్‌లో సంభాషణ పూర్తయ్యే సమయంలో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కు అవకాశం ఉన్నప్పటికీ దర్శకుడు కావాలనే కొంత ఖాళీని ఉంచాలని భావించారని తెలిపారు. ఆ మౌనం కూడా సన్నివేశంలోని భావాన్ని ప్రేక్షకులకు అర్థమయ్యేలా చేస్తుందని ఆదిత్య భావిస్తున్నారని చెప్పారు. కొన్ని హాలీవుడ్ సినిమాల్లో ఇలాంటి ట్రీట్‌మెంట్ కనిపిస్తుందని దర్శకుడు తన వాదనను వినిపించినట్లు నాగవంశీ తెలిపారు. అయితే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ విషయంలో తన అభిప్రాయం వేరుగా ఉంటుందని, సన్నివేశానికి తగిన సంగీతం ఉండాలని తాను సూచిస్తుంటానని చెప్పారు. ఈ తరహా విషయాల్లో తమ మధ్య తరచూ క్రియేటివ్ ఆర్గ్యుమెంట్స్ జరుగుతాయని, చివరికి సినిమా బాగుండాలన్నదే ఇద్దరి ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. దర్శకుడు ఆదిత్య హాసన్‌కు ఇప్పటికే మంచి గుర్తింపు ఉంది. ఆయన తెరకెక్కించిన '90s ఎ మిడిల్ క్లాస్ బయోపిక్' వెబ్ సిరీస్ మంచి ఆదరణ పొందింది. ఆ సిరీస్‌తో దర్శకుడిగా తన ప్రత్యేకతను నిరూపించుకున్న ఆదిత్య.. అదే సమయంలో నిర్మాత నాగవంశీ దృష్టిని ఆకర్షించారు. దీంతో ఆయనకు 'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' ద్వారా తొలిసారి సిల్వర్ స్క్రీన్‌పై దర్శకుడిగా అవకాశం లభించింది .ఈ సినిమాలో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. 'బేబీ' సినిమాతో ప్రేక్షకుల ఆదరణ పొందిన ఈ జోడీ మరోసారి కలిసి నటిస్తుండటంతో మూవీపై ఆసక్తి పెరిగింది. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీకి మరోసారి మంచి స్పందన వస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. సీనియర్ నటుడు శివాజీ కూడా ఈ చిత్రంలో కీలక పాత్రలో కనిపించనున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అబ్దుల్ వాహేబ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాకు సంబంధించిన పాటలు, నేపథ్య సంగీతం కథలో కీలకంగా ఉండనున్నట్లు చిత్రబృందం చెబుతోంది. 'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' కథ ప్రధానంగా లండన్ నేపథ్యంలో సాగుతుంది. విదేశాల్లో చదువుకునే యువత జీవితాన్ని ఆధారంగా చేసుకుని ఈ లవ్‌స్టోరీని రూపొందించినట్లు తెలుస్తోంది.





EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com